ANN తెలుగు

Follow: @ANNTELUGU

29-08-2025

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 265 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## మామ స్వాతిముత్యం.. అల్లుడు ఆణిముత్యం

### అతి తెలివితేటలతో అనుకుంటున్నారు

మేడిగడ్డ పనికిరాకుండా పోయింది

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలించిన సీఎం రేవంత్

వివరాలు 2లో









# జల ప్రళయం

## తెలంగాణలో అత్యధిక వర్షపాతం 431.5 మి.మి.లు

- నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలో అత్యల్పం 170.0 మి.మి.లు
- పలు జిల్లాల్లో జల ప్రళయం

వివరాలు 2లో

## రాష్ట్రంలో భారీ వర్షాలు, వరద పరిస్థితులపై నిరంతర సమీక్ష

- భారీగా నష్టపోయిన జిల్లాకు అదనంగా నిధులు
- యుద్ధ ప్రాతిపదికన రవాణా సౌకర్యం పునరుద్దరణ
- శవాలపై చిల్లర ఏరుకొనేలా బీఆర్ఎస్ వ్యవహారం
- రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వివరాలు 2లో

## కామారెడ్డి కన్నీరు

ఉత్తర తెలంగాణ అతలాకుతలం.. వరదల్లో 10 మంది మృతి

2వేల మందిని రక్షించిన పోలీసులు.. రక్షణ టీమ్ లు

వరద బాధిత ప్రాంతాల్లో సీఎం రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే

కామారెడ్డిలో అనుకూలించని వాతావరణం.. ఎల్లంపల్లి సందర్శన

మెదక్ లో సమీక్ష.. సహాయ చర్యలకు ఆదేశం

బాధితులకు బాసటగా కేంద్రమంత్రి బండి సంజయ్..

బండి సంజయ్ విజ్ఞప్తి మేరకు 4 ఆర్మీ హెలికాప్టర్లను పంపించిన రక్షణ శాఖ

నర్మాల వరదల్లో చిక్కుకున్న 5గురు ప్రాణాలను కాపాడిన 2 ఆర్మీ చాపర్లు

సమీక్షించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి..

బాధిత ప్రాంతాల్లో కేటీఆర్, హరీష్ రావు, ఎంపీ రఘునందన్, ఎమ్మెల్యేల పర్యటన

(మహా నెట్ వర్క్- కామారెడ్డి, మెదక్, హైదరాబాద్)

ఆకాశం విరిగి పడిందా. అన్నట్లు నదులు లేచి ఒక్క ఉదుటున మీద పడ్డట్లు.. మిన్ను విరిగినట్లు.. ముంచేసినట్లు ఉత్తర తెలంగాణను అతి భారీవర్షాలు అతలాకుతలం చేశాయి. ఆకస్మికంగా వచ్చిన కనివిని ఎరుగని వర్షం జలప్రళయమే సృష్టించగా.. ప్రజలు బెంబేలెత్తారు. కామారెడ్డి క్లౌడ్ బరస్ట్ తో కన్నీరు పెట్టగా, మెదక్‌తో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. నదులు, వాగులు పొంగడంతో జనావాసాల్లోకి వరదలు పోటెత్తాయి. ఈ వరదల ధాటికి ఇప్పటిదాకా 10 మంది చనిపోయిన సమాచారం ఉన్నట్లు అధికారులు పేర్కొనగా, వర్షభీభత్సం ప్రజల్లో భయాందోళన కలిగించింది. రాష్ట్రంలో భారీగా వర్షాలు కురుస్తుండటంతో సహాయక బృందాలు ఇప్పటికే పూర్తిగా అప్రమత్తంగా ఉండగా, వరదల్లో చిక్కుకున్న వాళ్లని ఇప్పటిదాకా 2 వేల మందిని రక్షించారు. వరద బాధిత జిల్లాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించగా, కామారెడ్డిలో వాతావరణం అనుకూలించలేదు. తర్వాత సీఎం మెదక్ లో సమీక్ష జరపగా, సీఎం వెంట మంత్రి ఉత్తమ్, పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ పాల్గొన్నారు. కామారెడ్డిలో మంత్రి సీతక్క సమీక్ష జరపగా, అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడి అప్రమత్తం చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్ చొరవతో.. ఐదు ప్రాణాలు రక్షించబడగా, సంజయ్ చొరవకు నర్మాల గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి కిషన్ రెడ్డి, కోమటిరెడ్డి తదితరులు వరద ప్రాంతాలపై సమీక్షలు జరపగా, ఎంపీ రఘునందన్, బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్‌రావు సిరిసిల్ల, సిద్దిపేట ప్రాంతాల్లో పర్యటించారు.

మిగతా 2లో





## వరదల్లో ఆత్మీయ దృశ్యం!

- బండి సంజయ్, కేటీఆర్‌ల మధ్య ఆప్యాయ పలకరింపు
- షేక్ హ్యాండ్ ఇచ్చుకుని.. ఆలింగనం చేసుకున్న నాయకులు
- ఎప్పుడూ ఒకరిపై ఒకరు విమర్శలు.. ఇద్దరి కలయిక సోషల్ మీడియాలో వైరల్

వివరాలు 2లో



## బండి సంజయ్.. రియల్ హీరో!

### నర్మాల వరదల్లో చిక్కుకున్న ఐదుగురు సేఫ్

02

- గ్రామస్తుల ప్రాణాలను కాపాడారంటూ కొనియాడుతున్న ప్రజలు
- ఆయన విజ్ఞప్తి మేరకు 4 ఆర్మీ హెలికాప్టర్లను పంపించిన రక్షణ శాఖ
- వరదల్లో గల్లంతైన నాగం కుటుంబానికి పరామర్శ.. రూ. లక్ష సాయం అందజేత




## ఇండియా టుడే మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే

వివరాలు 3లో


| బంగారం ధరలు | |
|---|---|
| 24 క్యారెట్ | 1,02,600 |
| 22 క్యారెట్ | 94,050 |
| సిల్వర్ (కేజీ) | 1,20,000 |

## క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ వేదిక కావాలి

- క్రీడా సంస్కృతిని పెంపొందించేందుకు కృషి...
- తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి
- క్రీడా పోటీలు, సబ్ కమిటీల ఏర్పాటుపై తీర్మానం

03






# జల ప్రళయం

(మొదటిపేజీ తరువాయి)

మెదక్: వరదల్లో చిక్కుకొని మృతిచెందిన బాధిత కుటుంబాలకు, పంట నష్టపోయిన రైతులకు సహాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీనిచ్చారు. పరిహారానికి సంబంధించి పూర్తి నివేదికలను సిద్ధం చేయాలని ఫోన్‌లో చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు ఇచ్చారు. మెదక్ ఎస్పీ కార్యాలయంలో జరిగిన వర్షాలు వరదలు సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కేంద్రం నుంచి అత్యవసరంగా నిధులు కోరేలా రిపోర్ట్ తయారు చేయాలని జిల్లా అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. వరద తగ్గగానే పంట నష్టంపై క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక తయారు చేయాలని ఆజ్ఞాపించారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల భవనాలను గుర్తించి, వాటిల్లో ఉన్న విద్యార్థులను వేరే చోటకు మార్చాలని సూచించారు. రామాయంపేట ఎస్సీ మహిళా డిగ్రీ కళాశాలకు పక్కా భవనం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి బృందం పెద్దపల్లి, మెదక్ జిల్లాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. కామారెడ్డిలోనూ పర్యటించాల్సి ఉండగా.. చివరి నిమిషంలో పర్యటన రద్దు అయ్యింది.

**వరద ముప్పు ఇంకా ఉంది**

వరద పరిస్థితులపై మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. సుమారు 45 నిమిషాలపాటు జరిగిన ఈ మీటింగ్‌లో పలు అంశాలకు సంబంధించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. వరద ముప్పు ఇంకా పోలేదని అప్రమత్తంగా ఉండాల్సిందేనని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. ప్రభావిత ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు సహాయక చర్యలను చేపట్టాలని ఆదేశించారు. పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. రోడ్లు తెగిన చోట యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి రవాణా సౌకర్యాన్ని పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌తో పాటు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. సీఎంకు ఎంపీ రఘునందన్ విజ్ఞప్తి : మెదక్ పట్టణం పిల్లికొట్టాల్‌లో నీట మునిగిన సబ్ స్టేషన్‌కు బదులు మరో కొత్త సబ్ స్టేషన్ మంజూరు చేయాలని ఎంపీ రఘునందన్‌రావు సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. మెదక్ నుంచి కామారెడ్డి వెళ్లే రహదారిని నాలుగు లేన్లుగా మార్చాలని, నిన్న నీటమునిగిన రామాయంపేట హాస్టల్ భవనాన్ని మరో చోట నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూనే విపత్తు నిధులను కేంద్రం నుంచి తేవాలని రఘునందన్‌రావును కోరారు.



**భారీగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు**

భారీ వర్షాలు, వరద కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు సబ్ స్టేషన్ లో నీరు చేరాయి. పదుల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ పంపిణీ వ్యవస్థ స్తంభించింది. ఎస్పీడీసీఎల్ పరిధిలో 1,357, ఎన్పీడీసీఎల్ పరిధిలో 108 విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. ఈ మేరకు ఎస్పీడీసీఎల్ సంస్థ చైర్మన్, ఎండీ ముషారఫ్ ఫరూఖీ గురువారం సంస్థ చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్ష ప్రభావంతో మెదక్ జిల్లాలో విద్యుత్ శాఖకు భారీ స్థాయిలో నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. మెదక్ జిల్లాలో వరద ప్రభావానికి కొన్ని చోట్ల సబ్ స్టేషన్లలో నీళ్లు చేరాయని తెలిపారు. 33 కేవీ ఫీడర్స్ 11, 11 కేవీ ఫీడర్స్ 175, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 262, విద్యుత్ స్తంభాలు 971 దెబ్బతిన్నాయని, వందల కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్ చెడిపోయిందని అధికారులు వెల్లడించారు. మెదక్ జిల్లాతో పాటు నల్గొండ, గద్వాల, యాదాద్రి, సంగారెడ్డి, నారాయణపేట జిల్లాల పరిధిలోనూ నష్టం వాటిల్లినట్లు తెలిపారు. వరద ప్రభావానికి 33 కేవీ ఫీడర్స్ 39, 11 కేవీ ఫీడర్స్ 296, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 280, విద్యుత్ స్తంభాలు 1,357 దెబ్బతిన్నాయని, వరద ఇంకా కొనసాగుతుండటం వలన నష్టాలు మరింత పెరిగే అవకాశం ఉన్నదని సీఎండీ తెలిపారు.

**ఐదుగురి ప్రాణాలు రక్షించిన బండి సంజయ్**

నర్మాల గ్రామస్తుల ప్రాణాలను కాపాడారంటూ బండి సంజయ్ కు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. వరదల్లో చిక్కుకున్నారని తెలిసిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన రక్షణ శాఖ మంత్రితో మాట్లాడిన బండి సంజయ్ విజ్ఞప్తి మేరకు 4 ఆర్మీ హెలికాప్టర్లను రక్షణ శాఖ పంపించింది. నర్మాల వరదల్లో చిక్కుకున్న 5గురు ప్రాణాలను రెండు ఆర్మీ చాపర్లు కాపాడాయి. మరో రెండు హెలికాప్టర్లను సిరిసిల్ల జిల్లా కేంద్రానికి అధికారులు పంపారు. ముంపు బాధితులను ఆదుకునేందుకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని కేంద్ర మంత్రి అప్రమత్తం చేశారు. నిరంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడుతూ పరిస్థితిని వాకబు చేశారు.

## రాష్ట్రంలో భారీ వర్షాలు, వరద పరిస్థితులపై నిరంతర సమీక్ష

### భారీగా నష్టపోయిన జిల్లాకు అదనంగా నిధులు

యుద్ధ ప్రాతిపదికన రవాణా సౌకర్యం పునరుద్దరణ

శవాలపై చిల్లర ఏరుకొనేలా బీఆర్ఎస్ వ్యవహారం

రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, వరద పరిస్థితులు, సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కొద్ది సమయంలోనే ముఖ్యంగా మెదక్, కామారెడ్డి ఆదిలాబాద్ జిల్లాల్లో కనీవినీ ఎరుగని రీతిలో వర్షపాతం నమోదైందన్నారు. అయినా కూడా ప్రాణ నష్టం, ఆస్తినష్టం వీలైనంత మేరకు తగ్గించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి సూచనల మేరకు బుధవారం మధ్యాహ్నం నుంచే పరిస్థితిని సమీక్షించామని వెల్లడించారు. వరదల్లో చిక్కుకున్నవారికి డ్రోన్ల ద్వారా ఆహారాన్ని అందిస్తున్నామన్నారు. సిరిసిల్ల జిల్లాలోని నర్మల గ్రామం వద్ద బుధవారం మానేరు వాగులో చిక్కుకున్న ఐదుగురిని హెలికాప్టర్ ద్వారా రక్షించామన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు వారం రోజుల క్రితమే కోటి రూపాయిల చొప్పున నిధులు విడుదల చేశామని, ప్రస్తుతం అతి భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న జిల్లాలకు అదనంగా ఎన్ని నిధులైనా మంజూరు చేస్తామని తెలిపారు.

భారీ వర్షాలతో స్థంభించిన జాతీయ రహదారితో పాటు పంచాయితీరాజ్, ఆర్ &బీ రోడ్లను క్లియర్ చేశామని, దెబ్బతిన్న రోడ్లను యుద్ధ ప్రాతిపదికన తాత్కాలికంగా పునరుద్దరిస్తున్నామని తెలిపారు. పలు మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు రహదారి సౌకర్యాలు దెబ్బతిన్నాయని వీటిని వెంటనే పునరుద్దరించేలా ఆదేశించామన్నారు. జిల్లాల్లో రెవెన్యూ. పోలీసు యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని తెలిపారు. గురువారం విపత్తుల నిర్వహణ శాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. అలాగే మెదక్ కామారెడ్డి సిరిసిల్ల నిర్మల్ జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వర్షాలు, వరదలపై ఆయా జిల్లాల యంత్రాంగంతో నిరంతరం మానిటరింగ్ చేసుకోవాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత నష్టాన్ని అంచనా వేయాలని సూచించారు. వర్షాలతో చనిపోయిన వారి కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో వర్ష బీభత్సం దృష్ట్యా ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు పని చేస్తున్నాయని, అవసరాన్ని బట్టి హెలికాప్టర్‌ల ద్వారా బాధితులను ఆదుకోవడానికి సిద్ధం చేశామని వివరించారు. కూలి పోయిన ఇండ్లు, నష్టపోయిన రైతులను ఆదుకుంటామని మంత్రి ప్రకటించారు.

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కేవలం ఒక గంట వ్యవధిలో 700 మిల్లీమీటర్ల వర్షం కారణంగా నీటి వనరులు పూర్తిగా నిండిపోయాయని, వాటని నుంచి ఉధృతంగా నీరు బయటకు వెళ్లడంతో గట్లు దెబ్బతిని తీవ్ర నష్టాన్ని కలిగించిందని వివరించారు. మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని తండాలు మరీ ఎక్కువగా వర్ష బీభత్సానికి గురయ్యాయని, ఈ తండాలకు తాగునీరు, విద్యుత్ సౌకర్యాలను వీలైనంత త్వరగా కల్పించేలా అధికారులను ఆదేశించామన్నారు. వర్షాల తర్వాత వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖకు సూచించామన్నారు. రాష్ట్రంలో ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే.. ప్రతిపక్షమైన బీఆర్ఎస్ రాజకీయ లబ్ధికోసం మాట్లాడడం సరికాదన్నారు. వారి పాలనలో వరదలొస్తే నాడు ఏం చేశారో.. నేడు ఏం జరుగుతుందో కళ్లకు కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని అన్నారు. శవాల మీద చిల్లర ఏరుకునే వ్యవహారం చేయవద్దని, ఉపయుక్తమైన సలహాలు ఇస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.





# బండి సంజయ్.. రియల్ హీరో!

## నర్మాల వరదల్లో చిక్కుకున్న ఐదుగురు సేఫ్

- గ్రామస్తుల ప్రాణాలను కాపాడారంటూ కొనియాడుతున్న ప్రజలు
- ఆయన విజ్ఞప్తి మేరకు 4 ఆర్మీ హెలికాప్టర్లను పంపించిన రక్షణ శాఖ
- వరదల్లో గల్లంతైన నాగం కుటుంబానికి పరామర్శ.. రూ. లక్ష సాయం అందజేత

**సిరిసిల్ల, మహా:** సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలో వరదల్లో చిక్కుకుపోయిన ఐదుగురు వ్యక్తులను కాపాడేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన కృషి ఫలించింది. ఆర్మీ హెలికాప్టర్లను ప్రత్యేకంగా రప్పించి బాధితులను ఎయిర్ లిఫ్ట్ చేసి కాపాడారు. దీంతో ప్రాణభయంతో వరదల్లో చిక్కుకుని బిక్కుబిక్కుమన్న బాధితులు క్షేమంగా బయటపడి ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు ఆర్మీ హెలికాప్టర్లు వస్తున్నాయనే సమాచారం అందుకున్న బండి సంజయ్.. గురువారం మధ్యాహ్నం నర్మాలకు చేరుకోవడం, అప్పటికే ఆర్మీ హెలికాప్టర్లు బాధితులను బయటకు తీసుకురావడం చకచకా జరిగిపోయాయి. ఈ నేపథ్యంలో నర్మాలకు కేంద్ర మంత్రి చేరుకోగానే క్షేమంగా బయటపడ్డ బాధితులు బండి సంజయ్ వద్దకు వచ్చి తమ ప్రాణాలను కాపాడినందుకు ధన్యవాదాలు తెలిపారు. మరోవైపు నర్మాల గ్రామస్థులతోపాటు అక్కడికి వచ్చిన జనమంతా బండి సంజయ్‌ను 'రియల్ హీరో' అంటూ అభివర్ణించారు. వారందరికీ అభివాదం చేస్తూ నర్మాల శివారులో పొంగి పొర్లుతున్న వరద ప్రవాహాన్ని వీక్షించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా బండి సంజయ్ సూచించారు. నిరంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడుతూ పరిస్థితిని బండి సంజయ్ వాకబు చేశారు. అలాగే వరదల్లో గల్లంతైన నాగం కుటుంబాన్ని పరామర్శించి రూ. లక్ష సాయం అందజేశారు.



# మామ స్వాతిముత్యం.. అల్లుడు ఆణిముత్యం

## అతి తెలివితేటలతో అనుకుంటున్నారు

### మేడిగడ్డ పనికిరాకుండా పోయింది

### శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలించిన సీఎం రేవంత్

**కరీంనగర్, మహా :** గత ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ పనికిరాకుండా పోయిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌లతో కలిసి ఆయన ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టే మనకు ప్రాణవాయివు అని, గోదావరి జలాల విషయంలో ఇది చాలా కీలకమన్నారు. చాలా వ్యూహాత్మక ప్రాంతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టును నిర్మించారని వివరించారు. కూలిపోయిన ప్రాజెక్టు, నిలబడిన ప్రాజెక్టుల మధ్య చాలా తేడా ఉందన్న రేవంత్ రెడ్డి ఇంజినీరింగ్ నిపుణులు సూచించిన చోటనే ఎల్లంపల్లిని నిర్మించారని, నిపుణులు కట్టిన ప్రాజెక్టు కనుకే దశాబ్దాల పాటు నిలబడిందన్నారు. మేడిగడ్డ విషయంలో సాంకేతిక కమిటీ సూచనలతో ముందుకు వెళ్తామని రేవంత్ రెడ్డి చెప్పారు. అనంతరం మెదక్ జిల్లా పర్యటించిన సీఎం అక్కడి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

**ఒకరు స్వాతి ముత్యం, మరొకరు ఆణిముత్యం**

మేడిగడ్డ పనికిరాకుండా పోయిందని, రిపేరు చేయకుండా అన్నారం, సుందిళ్లలో నీరు నిల్వ చేయొచ్చు కదా? అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సీఎం రేవంత్ రెడ్డి సమాధానమిచ్చారు. అతి తెలివితేటలతో మామ, అల్లుడు ఒకరు స్వాతి ముత్యం, మరొకరు ఆణిముత్యం అనుకుంటారని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. మేడారం, అన్నారం, సుందిళ్ల మూడు బ్యారేజీలు ఒకే రకమైన సాంకేతిక నైపుణ్యంతో నిర్మించారని చెప్పారు. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి అన్నారంలో పోయాలి అని, అక్కడి నుంచి సుందిళ్ల, శ్రీపాద ఎల్లంపల్లిలో పోయాలన్నారు. 3 బ్యారేజీల డిజైన్‌లో, నిర్మాణంలో, నిర్వహణలో లోపం ఉందని ఆయన వివరించారు. ఏదైనా ప్రమాదం జరిగితే గ్రామాలకు గ్రామాలు తుడిచిపెట్టుకుపోతాయని అన్నారు. వరద పరిస్థితిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్న సీఎం పలు సూచనలు చేశారు. మూడు బ్యారేజీల్లో నీటినిల్వ, ఎత్తిపోతలు క్షేమం కాదని ఎన్డీఎస్ఏ(నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ)చెప్పిందన్నారు. నీరు నిల్వచేశాక మొత్తం కూలిపోతే గ్రామాలు కొట్టుకుపోతాయని రేవంత్ వెల్లడించారు.

## తెలంగాణలో అత్యధిక వర్షపాతం 431.5 మి.మి.లు

### నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలో అత్యల్పం 170.0 మి.మి.లు

### పలు జిల్లాల్లో జల ప్రళయం

**హైదరాబాద్, మహా :** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వల్ల భారీ వర్షాలు, వరదలు తెలంగాణను ముంచెత్తుతున్నాయి. నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, నిర్మల్, సూర్యాపేట, మహబూబాబాద్, జనగామ, మంచిర్యాల, హన్మకొండ, వరంగల్, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. దక్షిణ తెలంగాణ ప్రాంతాలైన వికారాబాద్, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల, వనపర్తి, నారాయణపేట, నాగర్ కర్నూల్ జిల్లాలకూ భారీ వర్ష సూచన చేశారు. ఆయా జిల్లాల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వాతావరణ కేంద్రం అంచనాలకు అనుగుణంగా తెలంగాణలో అతి భారీ వర్షాలు పడుతున్నాయి. 27 వ తేదీ ఉదయం 8:30 గంటల నుంచి 28వ తేదీన సాయంత్రం 5 గంటల వరకు రికార్డయిన అత్యధిక వర్షపాతం వివరాలను భారత వాతావరణ కేంద్రం విడుదల చేసింది. కామారెడ్డి జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైంది. రాజంపేట మండలం అర్గొండలో 431.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. నిర్మల్ జిల్లా నిర్మల్ రూరల్ మండలంలోని అక్కాపూర్‌లో 323.3, మెదక్ జిల్లా హవేలిఘనపూర్‌లోని సర్దానాలో 305.3, కామారెడ్డి టౌన్ ఐడీఓసీ వద్ద 289.0, నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని వడ్డ్యాల్‌లో 279.3, కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లో 279.0 మిల్లీ మీటర్ల మేర వర్షపాతం నమోదైంది. మెదక్ జిల్లా హవేలిఘనపూర్‌లోని నాగపూర్‌లో 276.5, కామారెడ్డి జిల్లా తాడ్వాయిలో 275.8, కామారెడ్డి పాత రాజంపేటలో 247.3, నిర్మల్ జిల్లా విశ్వనాథపేటలో 241, నిర్మల్ జిల్లా నిర్మల్ రూరల్ మండలంలోని ముజిగిలో 231.5, మెదక్ జిల్లా చేగుంటలో 227.8 మిల్లీ మీటర్ల మేర వర్షం కురిసింది. కామారెడ్డి జిల్లా లింగంపేటలో 222.0, మెదక్ జిల్లా రామాయంపేటలో 206.0, మెదక్ ఆర్డీఓ కార్యాలయం వద్ద 205.8, కామారెడ్డి జిల్లా దోమకొండలో 202.0, మెదక్ జిల్లా రాజ్‌పల్లిలో 193.5, కామారెడ్డి జిల్లా మాచారెడ్డిలోని లాచాపేట్‌లో 190.0, కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లో 185.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లా కొండపాకలో 184.8, కామారెడ్డి జిల్లా పల్వంచలోని ఏలుపుగొండలో 180.8, సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని కొడకండ్లలో 178.8, కుమరం భీమ్ జిల్లా రెబ్బెనలో 177.8, కామారెడ్డి జిల్లా రామారెడ్డిలో 175.3, నిర్మల్ జిల్లా సారంగాపూర్‌లోని జామిలో 174.3 మిల్లీ మీటర్ల వర్షం పడింది. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేటలో 173.5, సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో 173.3, కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌లోని హసన్‌పల్లిలో 170.5, నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని పక్‌పట్లలో 170.3, నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలో 170.0 మిల్లీ మీటర్ల మేర వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

## వరదల్లో ఆత్మీయ దృశ్యం!

### బండి సంజయ్, కేటీఆర్‌ల మధ్య ఆప్యాయ పలకరింపు

షేక్ హ్యాండ్ ఇచ్చుకుని.. ఆలింగనం చేసుకున్న నాయకులు

ఎప్పుడూ ఒకరిపై ఒకరు విమర్శలు.. ఇద్దరి కలయిక సోషల్ మీడియాలో వైరల్




**సిరిసిల్ల, మహా:** సిరిసిల్లలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒకరికొకరు షేక్ హ్యాండ్ ఇచ్చుకున్నారు. ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ముఖ్యంగా కేటీఆర్, బండి సంజయ్ మధ్య మాటల యుద్ధం అనునిత్యం కొనసాగుతూనే ఉంటుంది. ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించడం, రాజకీయ వేదికలపై ఘాటు విమర్శలు చేసుకోవడం సర్వ సాధారణం. అలా పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉండే ఈ రాజకీయ ప్రత్యర్థులు.. ఎదురుపడితే ఎలా ఉంటుందో అన్న ఉత్కంఠకు తెర పడింది. గురువారం తెలంగాణలోని సిరిసిల్ల జిల్లాలో వరద బీభత్సం నేపథ్యంలో కేటీఆర్ వరద బాధితులను పరామర్శించి తిరుగు ప్రయాణమయ్యారు. ఇదే సమయంలో, కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా వరద ప్రాంతాలను సందర్శించేందుకు అక్కడికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో కేటీఆర్‌కు బండి సంజయ్ ఎదురుపడ్డారు. వీరిద్దరూ రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ హఠాత్ పరిణామం అక్కడ ఉన్నవారిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నెటిజన్లు రాజకీయాలకు అతీతంగా వెల్లివిరిసిన మానవత్వం అంటూ కామెంట్లు కురిపిస్తున్నారు. విపత్తు సమయంలో నాయకుల మధ్య ఏర్పడిన ఈ సానుకూల పరిణామం, ప్రజల్లో మంచి సందేశాన్ని పంపించిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఇండియా టుడే మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే

**తగ్గుతున్న మోదీ ప్రభ.. అయినా తిరుగులేదు.. ప్రతిపక్ష నేతగా రాహుల్ పర్ ఫెక్ట్**

**ఉత్తమ సీఎంలుగా టాప్ టెన్ లో చంద్రబాబు.. ఫస్ట్ ప్లేస్ లో అస్సాం సీఎం**





**ఢిల్లీ, మహా:** ఇండియాటుడే సీ ఓటర్ మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే విడుదలైంది. తాజా సర్వే ప్రకారం ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే.. ఎన్డీఏ కూటమికి 324 సీట్లు లభిస్తాయి. ప్రస్తుతం బీజేపీకి ఉన్న సీట్ల బలం 240 మాత్రమే. ఇప్పుడు తాజాగా ఎన్నికలను ఎదుర్కొనాల్సి వస్తే 300ల మార్క్ ను అందుకుంటుంది బీజేపీ. 324 స్థానాలతో నాలుగోసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. అదే సమయంలో ఇండియా బ్లాక్ 208 నియోజకవర్గాలకే పరిమితమవుతుంది. ప్రస్తుతం లోక్ సభలో ఈ బ్లాక్ కు ఉన్న సీట్ల సంఖ్య 234. ఇతరులకు 11 సీట్లు దక్కుతాయి. ఈ 14 నెలల కాలంలో దేశంలో చోటు చేసుకున్న పరిణామాలు.. ఎన్డీఏకు ప్లస్ పాయింట్ అయ్యాయని ఇండియాటుడే సీ ఓటర్ మూడ్ ఆఫ్ ది నేషన్ అంచనా వేసింది. ఈ ఏడాది జూలై 1 నుండి ఈ నెల 14వ తేదీ వరకు ఇండియా టుడే సీ ఓటర్ ఈ సర్వే నిర్వహించింది. దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని లోక్‌సభ నియోజకవర్గాల నుంచి 54,788 మంది అభిప్రాయాలను సేకరించింది. దీనికితోడు సీ ఓటర్ రెగ్యులర్ ట్రాకర్ డేటా నుంచి 1,52,038 ఇంటర్వ్యూలను కూడా పరిగణనలోకి తీసుకుంది. దీన్నీ విశ్లేషించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేలో ఎన్డీఏ కూటమికి 343 సీట్లు లభించాయి. ఇప్పుడీ సంఖ్య స్వల్పంగా తగ్గింది.

## బెస్ట్ సీఎంలలో చంద్రబాబు

ఆగస్టు 2025లో నిర్వహించిన ప్రతిష్టాత్మక ఇండియా టుడే 'మూడ్ ఆఫ్ ది నేషన్' పోల్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ సర్వే ప్రకారం, దేశంలోని ప్రధాన రాష్ట్రాల ముఖ్యమంత్రుల్లో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ ఉత్తమ పనితీరు కనబరిచిన ముఖ్యమంత్రిగా అగ్రస్థానంలో నిలిచారు. అస్సాంలో 44.6 శాతం మంది ప్రతివాదులు ఆయన పాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేయడంతో, 10 కంటే ఎక్కువ లోక్‌సభ స్థానాలు ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రుల జాబితాలో ఆయన మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ ర్యాంకింగ్స్‌లో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఇద్దరూ 41.9 శాతంతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ 40.7 శాతంతో నాలుగో స్థానంలో, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ 40.4 శాతంతో ఐదో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో మధ్య ప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ ఆరో స్థానం దక్కించుకోగా, ఏపీ సీఎం చంద్రబాబు 7వ స్థానంలో నిలిచారు. గతంలో ఆయన ఈ జాబితాలో ఐదో స్థానంలో ఉన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ 9 స్థానంలో నిలవగా, పంజాబ్ ముఖ్యమంత్రి 10 స్థానాన్ని దక్కించుకున్నారు.

# క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ వేదిక కావాలి

**క్రీడా సంస్కృతిని పెంపొందించేందుకు కృషి...**

**తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి**

**క్రీడా పోటీలు, సబ్ కమిటీల ఏర్పాటుపై తీర్మానం**




**హైదరాబాద్, మహా :** ఖేలో ఇండియా, కామన్ వెల్త్, ఒలింపిక్స్ ఇలా ఏ పోటీలు నిర్వహించినా వాటిలో తెలంగాణకు అవకాశం కల్పించాలని తెలంగాణ స్పోర్ట్స్ హబ్ తీర్మానం చేసింది. రాష్ట్రంలో స్టేడియాల నిర్వహణ, వసతులు మెరుగుపర్చడం, కోచ్‌లు, ట్రైనర్లకు శిక్షణ, క్రీడా పాలసీలో వివిధ అంశాలపై ప్రణాళిక రూపకల్పన, అమలుకు సబ్ కమిటీల ఏర్పాటుకు బోర్డు తీర్మానాలు చేసింది. తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు మొదటి సమావేశం హైదరాబాద్‌లో గురువారం జరిగింది. సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా విధానం, క్రీడల ప్రోత్సాహం విషయంలో ప్రతి ఒక్కరూ హైదరాబాద్ గురించి మాట్లాడుకోవాలనేదే తన లక్ష్యమన్నారు. క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ వేదికగా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. తెలంగాణకు ఐటీ సంస్కృతి ఉందని రాష్ట్రంలోని ప్రతి కుటుంబం తమ పిల్లలు ఐటీ రంగంలో ఉండాలని కోరుకుంటున్నారని, అలానే క్రీడా సంస్కృతి రావాలని తాను అభిలషిస్తున్నట్లు తెలిపారు. క్రీడా రంగం ప్రోత్సాహానికిగానూ గతంతో పోల్చితే 16 రెట్లు బడ్జెట్ పెంచామని సీఎం వివరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని సీఎం తెలిపారు. క్రీడా రంగం ప్రాధాన్యతను పెంచేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా పెద్ద ఎత్తున స్టేడియాలు, అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు లేవని, వాటిని సమగ్రంగా సద్వినియోగం చేసుకోవడంతో పాటు క్రీడా రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు బోర్డు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం కోరారు. క్రీడా రంగం అభివృద్ధికి నిధులు, నిపుణులు, నిర్వహణ అవసరమైనందునే బోర్డులో ప్రముఖ కార్పొరేట్లు, క్రీడాకారులు, క్రీడా నిర్వాహకులకు చోటు కల్పించామని సీఎం తెలిపారు. ఇండియా క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ మాట్లాడుతూ తొలుత క్రీడా సంస్కృతిని పెంపొందించాలని... ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో పాల్గొనేలా చూస్తే ఫలితాలు వాటంతటవే వస్తాయని అభిప్రాయపడ్డారు. హర్యానాలో కుస్తీతో ప్రతి క్రీడకు పల్లెల్లో చోటు ఉందని ఆయన గుర్తు చేశారు.

ప్రముఖ షూటర్ అభినవ్ బింద్రా మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు, వ్యాయామ సంచాలకుడు ఉండేలా చూడాలన్నారు. ధాని ఫౌండేషన్ వీతా ధానీ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని... వ్యాయామ అక్షరాస్యతపై అవగాహన పెంపొందించాల్సి ఉందన్నారు. బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి క్రీడా పోటీలు దశల వారీగా ఉండాలని అప్పుడు మెరుగైన క్రీడాకారుల ఎంపిక సాధ్యమవుతుందన్నారు. హబ్ కో చైర్‌పర్సన్ ఉపాసన కొణిదెల మాట్లాడుతూ ఫిజియోథెరపిస్టు కోర్సులను క్రీడా యూనివర్సిటీలో ప్రారంభించాలని కోరారు. అలాగే స్పోర్ట్స్ సామగ్రిపై పన్నుల భారం భారీగా ఉందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. హబ్ చైర్‌పర్సన్ డాక్టర్ సంజీవ్ గోయెంకా మాట్లాడుతూ ప్రపంచ ప్రముఖ కంపెనీల సీఈవోలు ఈ ప్రాంతం నుంచే ఉన్నందున వారి సేవలను క్రీడాభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు. విశ్వ సముద్ర ఫౌండేషన్ చింతా శశిధర్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి అవసరమైన సామగ్రిని పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచితే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. క్రీడా నిర్వాహకులు బియ్యాల పాపారావు మాట్లాడుతూ ఐఐటీ ప్రొఫెసర్లు మాదిరి స్పోర్ట్స్ యూనివర్సిటీలో కోచ్‌లు ఉండాలన్నారు. ఫుట్ బాల్ టీమ్ మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా మాట్లాడుతూ గ్రామ స్థాయిలో స్టేడియాలు, క్రీడా సామగ్రి అందుబాటులో ఉండే క్రీడాకారులు వెలుగులోకి వస్తారని తెలిపారు. ఇంగ్లాండ్‌లో ప్రతి ఆటకు లీగ్స్ ఉంటాయని, అలాగే మన దగ్గర ప్రతి ఆటకు లీగ్స్ ఉండాలన్నారు. ప్రముఖ క్రీడాకారుడు రవికాంత్ రెడ్డి మాట్లాడుతూ మనకు ఉన్న స్టేడియాలను మెరుగ్గా వినియోగించుకోవాలని, వాటి నిర్వహణ సక్రమంగా చేయాలన్నారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉన్న క్రీడా పోటీల విధానాన్ని మార్చుతూ గ్రామ, మండల, శాసనసభ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. శాసనసభ నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్ల మధ్య పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించి అంతిమంగా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి జట్లను ఎంపిక చేస్తామన్నారు.. క్రీడా సామగ్రిపై ఉన్న పన్నుల తగ్గింపునకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతామని... తమ స్థాయిలో అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఫిజియోథెరపీ, ఇతర క్రీడా సంబంధిత కోర్సులు ప్రవేశపెడతామని బోర్డు సభ్యులకు తెలియజేశారు. స్టేడియాలు పెద్ద సంఖ్యలో ఉన్నా తగిన సంఖ్యలో కోచ్‌లు లేరని, ఉన్న కోచ్‌లకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు తగినట్లు శిక్షణ ఇప్పించాల్సి ఉందన్నారు. రానున్న మూడేళ్లలో మనం సాధించాల్సిన లక్ష్యాలపై బోర్డు తగిన కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. సమావేశంలో క్రీడా వ్యవహారాల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డి, ఎండీ సోని బాల దేవి తదితరులు పాల్గొన్నారు.

# 6 నెలల సెలవుల్లో స్మితా సబర్వాల్!

## చైల్డ్ కేర్ లీవ్స్ ఆప్లై..

- ఆమె స్థానంలో ఐఏఎస్ కాత్యాయని దేవీ నియామకం
- నేను మళ్లీ ధృడంగా మారుతానంటూ ఇంట్రెస్టింగ్ ట్వీట్



**హైదరాబాద్, మహా:** స్టేట్ ఫైనాన్స్ కమిషన్ (ఎస్ఆఫ్సీ) మెంబర్ సెక్రటరీగా పనిచేస్తున్న ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ ఆరు నెలల పాటు చైల్డ్‌కేర్ లీవ్ తీసుకున్నారు. ఆమె అభ్యర్థన మేరకు ప్రభుత్వం 2025 ఆగస్టు 1 నుంచి 2026 జనవరి 31 వరకు లీవ్‌ను మంజూరు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానీయా ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో ఐఏఎస్ కాత్యాయని దేవీ మెంబర్ సెక్రటరీగా నియమితులయ్యారు. స్మితా సబర్వాల్ చేసిన ట్వీట్ ఆసక్తికరంగా మారింది. తాను అనారోగ్యం బారిన పడినట్లు ట్వీట్‌లో పేర్కొన్నారు. 'కొన్ని నెలలుగా నేను వెర్టెబ్రల్ ఆర్టరీ డిసెక్షన్ అనే వ్యాధి నుంచి కోలుకుంటున్నాను. అది చాలా నొప్పితో కూడి ఉండే ప్రక్రియ. నేను మళ్లీ ధృడంగా మారుతాను' అని సెల్ఫీ వీడియో షేర్ చేశారు. గత ప్రభుత్వం హయాంలో సీఎంవో కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వహించిన స్మితా సబర్వాల్ కాళేశ్వరం ప్రాజెక్టు సహా పలు కీలక అంశాలలో ముఖ్య పాత్ర పోషించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చించేందుకు ఈనెల 30 నుంచి అసెంబ్లీ సమావేశాలను ప్రభుత్వం నిర్వహించబోతుంది. అనంతరం కాళేశ్వరం నిర్మాణంలో అక్రమాలకు బాధ్యులైన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశముంది. ఈ క్రమంలో స్మితా సబర్వాల్ సెలవు వ్యవహారం చర్చనీయాంశమైంది.

# హైవేలు, రైల్వే లైన్లు దెబ్బ తిన్నాయి

- ఎప్పటికప్పుడు కేంద్రానికి అన్ని విషయాలు చెప్తున్నా
- వర్షాలపై కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ ఎప్పటికప్పడు మానిటరింగ్ చేస్తుంది
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, మహా:** తెలంగాణలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలో పలు ప్రాంతాలు పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రానికి అవసరమైన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని కేంద్రం అన్ని జిల్లాల వారీగా అందుబాటులో ఉంచిందని చెప్పారు. తాను ఎప్పటికప్పుడు కేంద్రానికి అన్ని విషయాలు చెప్తున్నానని, ఉత్తర తెలంగాణలోని చాలా జిల్లాల్లో జాతీయ రహదారులతో పాటు పలుచోట్ల రైల్వే లైన్లు దెబ్బతిన్నాయని చెప్పారు. వీటన్నిటి రెగ్యులర్ గా మరమత్తులు చేసేలా చూస్తున్నామన్నారు. 'మరో రెండు రోజులు భారీగా వర్షాలు ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ఉండాలి. హైదరాబాద్ ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలి. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని వాటర్ వర్క్స్ శాఖలో నిధుల కొరత కారణంగా చిన్న చిన్న పనులు కూడా కావడం లేదు' అని మండిపడ్డారు.










## సాహిత్య సమాచారం

**1 సెప్టెంబర్ రోజున త్రివేణి కవితా సంపుటి ఆవిష్కరణ**

ప్రముఖ కవి కేంద్ర సాహిత్య అకాడెమి అనువాద పురస్కార గ్రహీత వారాల ఆనంద్ రచించిన 'త్రివేణి'(మూడు పంక్తుల కవిత్వం) కవితా సంపుటి ఆవిష్కరణ సోమవారం సెప్టెంబర్ 1 న karimnagar కరీంనగర్ లోని కార్ఖానగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతుంది. వారాల ఆనంద్ వెలువరిస్తున్న 25 వ పుస్తకమిది. ఇటీవల తాను రాసిన పుస్తకాల్ని తాను చదువుకున్న విద్యాసంస్థల్లో ఆవిష్కరించుకునే ఒరవడిని మొదలు పెట్టిన ఆయన గత ఏడాది 'యాదొంకి బారాత్'ని ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీలో, 'కరచాలనం' పుస్తకాన్ని కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఆవిష్కరించారు. 'త్రివేణి' కవిత్వాన్ని పాఠశాల స్థాయిలో తనకు హిందీ నేర్పిన ఉపాధ్యాయుడు శ్రీ ఉడుత రాజేశం ఆవిష్కరిస్తారు. పాఠశాల విద్యార్థినీ విద్యార్థుల నడుమ ఆవిష్కరణ జరగడం సంతోషమని ఆనంద్ అన్నారు. పలువురు ఆత్మీయులు కవులు హాజరవుతారు. కార్ఖానగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

**- వి.ఇందిరా రాణి,**
**పోయెట్రీ ఫోరం. కరీంనగర్**

## రచనలకు ఆహ్వానం

ప్రతిరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి. మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

# కష్టజీవుల పోరాటయోధుడు

## కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి

మార్క్సిజం వెలుగులో ఎర్రజెండా నీడలో అంతిమ శ్వాస వరకు ఎత్తిన జెండా దించకుండా పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఒకేపార్టీలో కొనసాగి ఎందరికో ఆదర్శప్రాయుడుగా నిలిచి పేద ప్రజల గుండెల్లో చిరస్మరణీయమైన ముద్ర వేసిన పోరాట యోధుడు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ఈ నెల 22 నాడు మరణించడం కడు విషాదకరం. విద్యార్థి దశ నుండి పోరాట స్వభావాన్ని ఆయన అలవర్చుకొని అతి సాధారణ కార్యకర్తనుండి అంచెలంచెలుగా ఎదిగి జాతీయ రాజకీయాలోకి ప్రవేశించి తెలుగు నేల నుండి మూడు పర్యాయాలు భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ) జాతీయ ప్రధాన కార్యదర్శిగాను మరియు రెండు పర్యాయాలు నల్గొండ పార్లమెంట్ సభ్యుడు గాను నిరుపమాన సేవలు అందించారు. తన వాగ్ధాటితో ఆయన ఎందరినో ఆకట్టుకుని గొప్ప జనార్షక నేతగా వెలుగొందారు. పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద విధానాలను ఆయన తీవ్రంగా ప్రతిఘటించారు. అలాగే మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా లౌకిక ప్రజాతంత్ర ఉద్యమాల ద్వారా ఆయన తీవ్రంగా నిరసించారు. తన జీవితమంతా ఆయన కష్టజీవుల అభ్యున్నతి కోసం అంకితం చేసి ఆ దిశగా నిరంతరం ఉద్యమించారు. ఆయన అనేక సవాళ్లను అధిగమించి సాధారణ స్థాయి నుండిఉన్నత స్థానానికిఎదిగిననూ కూడా అతి సాధారణ జీవితాన్ని గడిపారు. కష్టజీవుల పోరాటయోధుడు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ఉమ్మడిమహబూబ్ నగర్ జిల్లాలోని కోడేరు మండలంలో గల కొండ్రావుపల్లి గ్రామంలో సురవరం వెంకట్రామిరెడ్డి, ఈశ్వరమ్మ దంపతులకు 1942 మార్చి 25 నాడు ప్రథమ సంతానంగా జన్మించారు. నేటిజోగులాంబ గద్వాల జిల్లాలోని ఉండవల్లి మండలం కంచుపాడు ఆయన స్వగ్రామం. తండ్రి సురవరం వెంకట్రామిరెడ్డిస్వాతంత్ర్యసమరయోధుడు మరియు తెలంగాణా సాయుధ పోరాట యోధుడు. తండ్రి నుండి ఆయన చిన్నతనంలోనేపోరాట స్వభావాన్ని అలవర్చుకున్నారు. తెలంగాణ సాంస్కృతిక రంగ వైతాళికుడు, గోల్కొండ పత్రిక వ్యవస్థాపకుడు సురవరం పతాపరెడ్డి ఆయనకు పెదనాన్న కావడం గమనార్హం. ఒకవైపు తండ్రి స్వాతంత్ర్యపోరాట స్ఫూర్తిని పుణికిపుచ్చుకున్న సురవరం మరోవైపు పెదనాన్న కొనసాగించిన సాంస్కృతిక ఉద్యమ ఆదర్శాలను అనుసరించడం విశేషం. స్వగ్రామమైన కంచుపాడుపై ఉన్న మమకారంతో ఆయన తన తండ్రి వెంకట్రామిరెడ్డి పేరు మీద విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసిఎందరినో విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దారు. సురవరం సుధాకర్రెడ్డితన పదేళ్ల వయస్సులోనేసాహిత్యం చదవడం అలవరచుకున్నారు. విద్యార్థి దశలో ఉన్నప్పుడే ఆయనను కమ్యూనిస్టు భావజాలం ఎంతగానో ఆకర్షించింది. ఫలితంగా ఆయన విద్యార్థి దశ నుంచి పశ్నిర్ంచడం అలవరచుకున్నారు. సురవరం సుధాకర్రెడ్డి1957లో కర్నూలులోని మున్సిపల్ పాఠశాలలో ఎస్.ఎస్.ఎల్.సిచదువుతున్న సమయంలో 15 ఏళ్లవయసులో పాఠశాలల్లో బ్లాక్ బోర్డ్స్ , చాక్పీస్ మరియు ప్రాథమిక అవసరాల కోసం చేపట్టిన ఆందోళన కర్నూలు జిల్లాలోని అన్ని పాఠశాలలకు విస్తరించి ఉద్యమంగా మారడంతో ఆయన జీవితానికిరాజకీయ బాటలు పరిచిందిఅని చెప్పవచ్చు. సురవరం సుధాకర్రెడ్డి 19 ఏళ్లకేఅఖిల భారత విద్యార్థిసమాఖ్య (ఎ.ఐ.ఎస్.ఎఫ్) కర్నూలు పట్టణ విభాగానికి కార్యదర్శిగా ఎన్నికై1960 నాటికి కర్నూలు జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1962లో



శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆయా విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం 56 రోజుల పాటు ఏకధాటిగా పెద్దఎత్తున నిర్వహించిన సమ్మెకు సురవరం సుధాకర్రెడ్డి నాయకత్వం వహించి సరికొత్త చరిత్ర సృష్టించారు. ఆయన 1964లో కర్నూలులో బి.ఏ చదువుతున్న సమయంలో కళాశాల విద్యార్థిసంఘం అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ప్రతి విద్యార్థికి చదువు మరియు పోరాటం రెండు కళ్ళు అని ఆయనతరచుగా పేర్కొనేవారు. డిగ్రీతర్వాత విజయవాడలోని విశాలాంధ్రదినపత్రికలో సురవరం సుధాకర్ రెడ్డి పనిచేయాలనుకున్నారు. కానీ పార్టీఆదేశం మేరకు ఆయన 1965లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్.ఎల్.బి కోర్సులో చేరి కళాశాల పధాన కార్యదర్శిగా. ఆ తర్వాత ఎ.ఐ.ఎస్.ఎఫ్ రాష్ట్రకార్యదర్శిగా, 1966లో ఎ.ఐ.ఎస్.ఎఫ్ జాతీయ పధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1967లో హైదరాబాద్లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని లా కాలేజీ నుండి ఎల్.ఎల్.బి డిగ్రీని పొందారు. 1968లో ఎల్.ఎల్.ఎమ్ కోర్సులో చేరినప్పటికిఆయన విద్యార్థినాయకుడిగా కొనసాగుతుండటంతో దాన్ని పూర్తిచేయలేకపోయారు. కేరళకు చెందిన చంద్రప్పన్ తో కలిసిసురవరం సుధాకర్రెడ్డి'18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించాలి' అని 1969 లో పార్లమెంటు ముందు మహాపదర్శన నిర్వహించారు. 1970లో సురవరం సుధాకర్ రెడ్డి ఎ.ఐ.ఎస్.ఎఫ్ జాతీయ అధ్యక్షుడుగా ఎన్నికై అనేక విద్యారంగ సమస్యల పరిష్కారాల కోసం ఉద్యమించారు. అలాగే ఉత్తరపదేశ్ రాష్టంలో విద్యార్థి సంఘాన్ని పునరుద్ధించడంలో ఆయన ప్రముఖపాత్ర పోషించారు. సోవియట్ యూనియన్, చెకొస్లొవేకియా, హంగేరి, ఆఫ్ఘనిస్తాన్ లాంటిదేశాల్లో జరిగిన సమావేశాల్లో ఆయన అంతర్జాతీయ విద్యార్థి సంఘం కార్యవర్గసభ్యుని హోదాలో పాల్గొన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి 1972లోఏ.ఐ.వై.ఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి కాశ్మీర్ నుంచి కేరళ వరకూ విద్యార్థి, యువజనోద్యమాల బలోపేతానికి విస్తృతంగా పర్యటించారు. విద్యార్థి, యువజన ఉద్యమాల్లో నిరసనలు చేస్తున్న క్రమంలో ఆయన దేశవ్యాప్తంగా ఢిల్లీ, కోల్ కతా, పాట్నా, లక్నోలతోపాటు అనేక చోట్ల నిర్బంధాలకు గురయ్యారు. రాజమండ్రిలో 1974లో జరిగిన సి.పి.ఐ రాష్ట్రమహాసభలో సురవరం సుధాకర్ రెడ్డి పార్టీ కార్యదర్శిగా ఎన్నికై రెండు పర్యాయాలు 1984 వరకు ఆ బాధ్యతలు నిర్వహించారు. తన తల్లి తరపు బంధువులు ఉన్న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సురవరం సుధాకర్ రెడ్డి 1985, 1989 లలో ఎం.ఎల్.ఎ అభ్యర్థిగా పోటీచేసిఓడిపోయారు. మళ్ళీ పార్టీ అదేశానుసారం 1994 లో కర్నూలు జిల్లాలో పార్టీ బలంగా ఉన్న డోన్ నియోజకవర్గంలో అప్పటి ముఖ్యమంత్రికోట్ల విజయభాస్కరరెడ్డి పైపోటీ చేసిననూ ఆ ప్రాంతాల్లో ఫ్యాక్షన్ ముఠాలు రిగ్గింగ్ లకు పాల్పడటంతో ఆయన ఓటమి చెందారు. సురవరం సుధాకర్రెడ్డి 1998 లో నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీచేసి 12 వ లోక్ సభకు తొలిసారిగా గెలుపొందారు. ఆ సమయంలోనే మానవ వనరుల అభివృద్ధికమిటి మరియు ఔషధ నియంత్రణ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. కానీ 13 నెలలకే పార్లమెంటు రద్దు కావడం గమనార్హం. సురవరం సుధాకర్ రెడ్డి 2000 సంవత్సరంలో సి.పి.ఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట కార్యదర్శి గాను మరియు జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ 2000 సంవత్సరంలో విద్యుత్ బిల్లుల పెంపునకు వ్యతిరేకంగా వామపక్షాలు చేసిన పోరాటంలో ఆయన కీలక పాత్రపోషించారు. 2004 లో నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి సుధాకర్ రెడ్డి పోటీచేసి 14 వ లోక్ సభకు రెండవ సారిఎన్నికయ్యారు. ఆ విధంగా ఆయన నల్గొండ నియోజకవర్గం నుండి రెండుసార్లు (1998 మరియు 2004) పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ సమయంలోనే ఆయన గ్రామీణాభివృద్ధి కమిటి, హౌస్ కమిటి, సమాచార, పసార మంత్రిత్వ శాఖలో సలహా కార్యవర్గ సమితి సభ్యుడిగా కొనసాగారు. లోక్ సభలో పజా సమస్యలను లేవనెత్తడంలో సురవరం సుధాకర్ రెడ్డి ముందుండేవారు. పార్లమెంటు వేదికగా నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్య, విదేశాల్లో నల్లధనం, దేశంలో రైతుల ఆత్మహత్యలు, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం, సామాజిక భద్రత, జిల్లాలో సాగునీటి పథకాల అమలు మరియు కరువు మొదలైన అంశాలపై ఆయన పజాప్రతినిధిగా ప్రజాపక్షం వహించి ప్రజాగొంతుకగా నినదించారు. 2004 లోనే ఆయన కార్మికశాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీఛైర్మన్ అయ్యారు. అలాగే ఆయన ఐక్యరాజ్యసమితిలో భారత పతినిధిగా పలు ప్రసంగాలు చేశారు. హైదరాబాద్లో 2008 లో జరిగిన పార్టీ జాతీయ 20 వ మహాసభలో సి.పి.ఐ డిప్యూటీజనరల్ సెక్రటరీగా సురవరం సుధాకర్ రెడ్డి ఎన్నికయ్యారు. 2012 (పాట్నాలో), 2015 (పుదుచ్చేరిలో), 2018 (కొల్లం) లలో జరిగిన జాతీయ కాంగ్రెస్ సందర్భంగా సురవరం సుధాకర్రెడ్డి సి.పి.ఐ జనరల్ సెక్రటరీగా వరుసగా మూడుసార్లు ఎన్నికై సరికొత్త చరితను సృష్టించారు. చండరాజేశ్వర రావు తరువాత సి.పి.ఐ జాతీయ పధాన కార్యదర్శిగా ఎన్నికైన రెండోతెలుగు వ్యక్తిగా సురవరం సుధాకర్ రెడ్డి చరిత్రసృష్టించారు. చంద్ర రాజేశ్వరరావు అడుగుజాడలలో సురవరం సుధాకర్ రెడ్డి పురోగమించారు . క్షేత్రస్థాయి వాస్తవాలకు అనుగుణంగా ఆయన ముందుకు పయనించారు. ఆయన భారత కమ్యూనిస్టు పార్టీపతినిధిగా ఆయన అమెరికా, చైనా, బంగ్లాదేశ్, ఇంగ్లండ్, ఫ్రాన్స్, పాకిస్తాన్, ఇటలీ దేశాల్లో ఆయా కమ్యూనిస్టు పార్టీల సమావేశాలకు హాజరయ్యారు.

తెలంగాణ ఉద్యమంలో సురవరం సుధాకర్రెడ్డికీలక పాత్రపోషించారు. మొదట్లో భాషా పయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు మద్దతు తెలిపిన సి.పి.ఐ పార్టీతర్వాత ప్రత్యేక ప్యాకేజీని సైతం తోసివేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రసాధనకు మద్దతు పలకడం గమనార్హం. గతంలో విశాలాంధ్రకోసం ఉద్యమించిన భారత కమ్యూనిస్ట్ పార్టీ మలిదశ తెలంగాణ పోరాటంలో క్రమంగా తన నిర్ణయాన్ని మార్చుకోవడంలో సురవరం సుధాకర్ రెడ్డి క్రియాశీలంగా వ్యవహరించారు అని నిర్దిష్టంగా చెప్పవచ్చు. ప్రత్యేక తెలంగాణ డిమాండ్ కు మద్దతు ఇవ్వడం సరైనదేఅని ఆయన సి.పి.ఐ రాష్ట్రకార్యదర్శిగా పార్టీ కేంద్రనాయకత్వాన్ని మరియు ఆంధలోని తన సహచరులను సురవరం సుధాకర్ రెడ్డి ఒప్పించగలగడం అనన్య సామాన్యం. ఆ రకంగా తెలంగాణ ప్రజాభిప్రాయం మేరకు ప్రత్యేక




**- జె.జె.సి.పి. బాబూరావు**
**రీసెర్చ్ స్కా లర్**
**సెల్: 94933 19690**

తెలంగాణా రాష్ట్రఆవిర్భావ ఆకాంక్షకు అనుగుణంగా పార్టీనిర్ణయాన్ని పకటింపజేయడంలో ఆయన పధాన పాత్ర పోషించారు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. భూస్వామ్య కుటుంబంలో జన్మించిన సురవరం సుధాకర్ రెడ్డి తొలిసారిగా కర్నూలు జిల్లా మొలగవల్లి గ్రామంలో మిగులు భూములపైభూపోరాటంలో పాల్గొన్నారు. అనేక పోరాటాల ఫలితంగా ఎట్టకేలకు 250 మందిపేద కుటుంబాలకు పంపిణీ చేశారు. మెదక్, నల్లగొండ, అనంతపురం జిల్లాలలో జరిగిన అనేక భూపోరాటాలలో ఆయన ముందుండి ఉద్యమించారు. ముఖ్యంగా మహబూబ్నగర్ జిల్లా పెదకొత్తపల్లి మండలంలో భూపోరాట యోధుడు చంద్రరాజేశ్వరరావుతో కలిసిభూ ఆక్రమణోద్యమ ఫలితంగా 300 ఎకరాలను పేదలకు పంచజేయడంలో ఆయన ప్రముఖంగా ఉద్యమించారు. అలాగేపేదలకు కరువు పెన్షన్ కోసం ఆయన ఎంతగానో ఉద్యమించి విజయం సాధించారు. స్పష్టమైన అభిప్రాయాలతో అనర్గళంగా మాట్లాడగలిగే ఉపన్యాసకుడుగా సురవరం సుధాకర్ రెడ్డి పేరు గడించారు. రాజకీయ, సామాజిక, చారిత్రక విషయాలను విశ్లేషణాత్మకంగా వివరిస్తూ ఉపన్యసించడం ఆయన ప్రత్యేకత. ఆయన ప్రసంగాలు ఎందరినో ఆకట్టుకున్నాయి. అలా ఆయన తన వాగ్ధాటితో ఎంతోమందిని పభావితం చేశారు. అలాగేఆయన తెలుగు మరియు ఆంగ్ల భాషలలో అనేక రచనలు విస్తృతంగా రాశారు. ఆయన వామపక్షాల ఐక్యతను ఆశించారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ అనారోగ్యంతో ఉన్నా కూడా అంతిమ శ్వాస దాకా పార్టీ ఆశయాల కోసం పరితపించిన కష్టజీవుల పోరాటయోధుడు కామ్రేడ్ సురవరం సురవరం సుధాకర్ రెడ్డి మరణం కష్టజీవులకు మరియు భారత కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటు. పభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలి అని తెలంగాణ రాష్ట్రపభుత్వం నిర్ణయించి ఆ ప్రకారమే ఆయనకు ఆయనకు సముచిత గౌరవాన్ని కల్పించింది. ఆదర్శాలు అందరూ నొక్కి వక్కాణిస్తారు. కాని కొందరు మాత్రమే ఆ ఆదర్శాలను కడదాకా ఆచరించి భావి సమాజానికి ఆదర్శప్రాయులుగా నిలుస్తారు. అంతిమంగా అతి సామాన్యమైన మరియు నిరాడబరమైన జీవితాన్ని గడిపి కమ్యూనిస్టులకు ఆదర్శప్రాయంగా నిలిచిన సురవరం సుధాకర్ రెడ్డి రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ అదేపోరాట స్ఫూర్తితో ఆయన ఆశయాలను సాధించేదిశగా ''వర్గదోపిడీలేని సమసమాజ స్థాపన' కోసం నిరంతర పోరాటాలు కొనసాగించడమేఆయనకు అందించేనిజమైన నివాళి.

# తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటి స్వర్ణ దేవాలయం

## శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం : బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 12 విశిష్టత

నిర్మల మనస్కుడైన భక్తుడు భగవంతునితో ఎలా మమేకం కావాలో నారాయణ బట్టాత్రి "శ్రీమన్నారాయణీయం"లో చెబుతున్నారు. గురువాయూర్ శ్రీకృష్ణుని ప్రార్థిస్తూ "నాపై నీ కరుణ ప్రసరించే వరకు శోకిస్తూ నీ పాదాల వద్దే నా రోజులు గడుపుతాను " అంటాడు కవి. నిన్ను వ్యతిరేకించే వారంతా సుఖంగా జీవితాన్ని గడుపుతుంటే నీ భక్తుడనైనా నేను నాన్న బాధలు పొందుతున్నానెందుకు ? ఇది నీకు కీర్తినిస్తుందా ? అంటాడు. ఇది చాలా సహజమైన ప్రశ్న కూడా ! కష్టాలలో సమస్యలతో నిండా కూరుకుపోయి ఉన్న భక్తజనులు, భగవంతునిపై నమ్మిక లేనివారు సుఖంగా ఉంటే తనకెందుకు ఈ బాధలు అనుకుంటారు. అయితే, వారి సుఖం తాత్కాలికం. క్షణికం. కష్టాల భారం మోసే కొద్దీ భగవంతునిపై భక్తి విశ్వాసాలు బలపడి ఆత్మలో భగవంతుని దర్శనమయ్యక ఆ ఆనందం వర్ణనాతీతమని పెద్దలు చెబుతారు. నేటి ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య సమస్యలు వ్యక్తిగత మరియు కుటుంబ సంబంధిత సమస్యలు విద్యా సంబంధిత సమస్యలు పని సంబంధిత సమస్యలు లేదా డబ్బు సమస్యల కారణంగా అసంతృప్తితో ఉన్నారు. ప్రతి యుగంలో భౌతిక ప్రపంచంలోని మండుతున్న వేడి నుండి తన భక్తులను సురక్షితంగా ఉంచడానికి పరమాత్మ ఏదో ఒక రూపంలో తనను తాను వ్యక్తపరుస్తాడు. నగర నలుమూలల నుండి భక్తులు ఉదయం నుండి హరే కృష్ణ స్వర్ణ దేవాలయం, స్వయంభు శ్రీ లక్ష్మి నరసింహ స్వామి క్షేత్రంలోని పాంచజన్నేశ్వర స్వామి ఆలయంలోకి బారులు తీరుతారు. వేదమంత్రాలు అష్టోత్తరముతో మహాభిషేకం నిర్వహిస్తారు. ఈ ఆలయం ఎక్కడుందో రండి ! చూద్దాం ! శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం నగరంలోని ఒక పురాతనమైన ఆలయం. ఇది బంజారా హిల్స్ లోని ఒక కొండపై ( రోడ్ నెంబర్ 12 లో ) ఉన్నది. ఈ ఆలయ ప్రధాన దైవం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఒక



పురాతన స్వయంభు వ్యక్త దేవత. ఒక ఉద్భవ శిలపై నిలబడి ఉన్న భంగిమలు కనిపిస్తాడు అతని భార్య శ్రీ లక్ష్మీదేవి స్వయంభు గా నిలబడి ఉన్న భంగిమలో ఉన్నది. లక్ష్మీదేవి కరోనాతో తన అభయ హస్తాన్ని చూపిస్తూ భక్తులందరినీ ఆశీర్వదిస్తుంది. ఇక్కడ భగవంతుడు నరసింహస్వామి ఆనందకరమైన దైవిక రూపంలో కనిపిస్తాడు. ఇది చాలా అరుదు. ఈ దేవత ఏడవ దశాబ్దం లేదా ఎనిమిదవ శతాబ్దానికి చెందినదని మరియు భక్తులు దాదాపు 400 సంవత్సరాల క్రితం కనుగొన్నారని చెబుతున్నారు. 1907 లో మహారాజా శ్రీకృష్ణ ప్రసాద్ జాగీర్దార్ 47.19 ఎకరాల భూమిని ప్రధాన దేవుడికి ఇచ్చారు. ఈ ఆలయం 1993 నుంచి దేవాలయ శాఖ పరిధిలోకి వచ్చింది. యాదగిరిగుట్ట ఆలయం 2002 సంవత్సరంలో ఈ ఆలయాన్ని దత్తత తీసుకుంది.

ఆలయాలు కేవలం ఆధ్యాత్మికతపు మాత్రమే పరిమితం కావని సాటి మానవుడికి చేసే అనేకమైన సేవల ద్వారా కూడా భగవంతుడికి చేరువ కావచ్చునని నిరూపిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని మొట్టమొదటి స్వర్ణ దేవాలయం హైదరాబాదులోని బంజారాహిల్స్ లో గల స్వయంభు శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం. లక్ష్మి నరసింహ స్వామి దేవాలయానికి వెయ్యిళ్లకు పైగా చరిత్ర ఉంది. అదృష్టవంతులైన భక్తులు స్వయంభూ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి గర్భాలయంలో ఉంచబడిన అరుదైన సాలిగ్రామ శిల దర్శనం కూడా పొందవచ్చు ఈ సాలిగ్రామశిల గంటకి నదిలో అంటే నేపాల్ లోని ముక్తిదః ఆలయ సమీపంలో కనుగొనబడింది. మరియు భక్తులను స్వచ్ఛమైన భక్తితో ఆశీర్వదించడానికి భగవంతుని అనూహ్యమైన శక్తి ద్వారా ఈ క్షేత్రానికి అద్భుతంగా చేరుకుంది. రెండు చేతుల్లో శంఖచక్రాలు ,మూడో చేతిలో జపమాల ఉంటుంది. నాలుగవ చేతిలో అక్షమాల ఉంటుంది ఇక్కడి శ్రీ లక్ష్మీనరసింహుడిని చూసుకుంటూ హనుమంతుడు అపురూపంగా కనిపిస్తాడు శ్రీ చతుర్భుజ జపఆంజనేయ స్వామిని భక్తులు ముందు దర్శించుకుంటారు ఇక్కడ భక్తులు మంత్ర పీఠంలో జపం చేసి ఆలయంలోకి శ్రీ రాధా గోవిందుల ఆర్చమూర్తుల సుందరాకృతులను మనస్సు నిండా నింపుకొని హరే కృష్ణ మహా మంత్రాన్ని జపిస్తూ తన్మయం పొందుతారు. తర్వాత అనంత శేషుడిపై నిల్చుని ఉన్న లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకుంటారు. ఇక్కడ హరే కృష్ణ ఆధ్యాత్మిక సమాజసేవ కార్యక్రమాలు జరుపుతున్నారు. ఈ కార్యక్రమాలలో యువతకి ప్రస్తుత ప్రపంచ వాస్తవికతలకు వేద జ్ఞానాన్ని ఎలా అనుభవించాలో బోధిస్తుంది అలాగే రోజువారి జీవితంలో అనుభవించే కఠినమైన సమస్యలకు పరిష్కారాలు జ్ఞాపకశక్తి ఏకాగ్రత చెడు అలవాట్లను ఎలా వదిలించుకోవాలి,జీవితంలో కుంగుబాటులను అధిగమించి ఆత్మవిశ్వాసాలను అధిగమించడం ఇంకా సమాజంలో ఎలా కొనసాగించాలో ఎలా పర్యవేక్షించాలంటే ఎన్నో విషయాలకు వేదికగా మారడం ముదావహం.

మన దేవాలయాలన్నీ ఆధ్యాత్మిక విజ్ఞాన కేంద్రాలు కావాలన్నది మనిషికి భగవంతుడికి మధ్య ఉన్న పరమార్థాన్ని తీర్చి కలియుగ కల్మషాలన్నీటిని పారదోలడానికి దేవాలయాలు దోహదం చేస్తాయి. ఇందుకోసమే ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందడానికి అణువుగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని స్వర్ణ దేవాలయాన్ని దర్శించుకోవడం అంతేకాకుండా ,నాలుగు చేతుల జప ఆంజనేయుడు మీకు భగవంతుని పవిత్ర నామాలను జపించడానికి బలాన్ని ప్రసాదిస్తాడు. మరియు శ్రీ రాధా గోవిందుడు మీకు భగవంతుని ప్రేమ కృష్ణ ప్రేమను అనుగ్రహిస్తాడు. స్వయంభు శ్రీ లక్ష్మి నరసింహ స్వామిని విఘ్న వినాయకుడు అని పిలుస్తారు. మీ జీవితంలోని అన్ని అడ్డంకులను లేదా విఘ్నాలను తొలగించగల ఏకైక సర్వోన్నతుడు. బంజారా హిల్స్ లోని ఈ స్వామిని దర్శించుకొనడం పూర్వజన్మ సుకృత ఫలం.భగవంతుని దివ్యసంకల్పం 7 సంవత్సరాల తర్వాత బంజారాహిల్స్ లోని రోడ్డు నెంబర్ 12 వద్ద ఒక గొప్ప హరే కృష్ణ స్వర్ణ దేవాలయానికి దారితీసింది. హరే కృష్ణ స్వర్ణ దేవాలయం తెలంగాణలోని ఒకటవ స్వర్ణ దేవాలయం మరియు ఈ అతీంద్రియ ఆలయములో 57ల స్వర్ణ ధ్వజస్తంభం 4600 చదరపు అడుగుల మహా మండపం మరియు 5 బంగారు మెట్ల రాజ గోపురం ఉన్నాయి. హరే కృష్ణ స్వర్ణ దేవాలయాన్ని సందర్శించడం ద్వారా భక్తులు తమ జీవితంలో ప్రతిరోజు ఎదుర్కొంటున్న నేటి బహుముఖ సమస్యల నుండి చాలా ఉపశమనం పొందవచ్చు స్వయంభు శ్రీలక్ష్మి ప్రసాదించిన ఆశీర్వాదాలు మరియు తమ జీవితంలోని అన్ని అడ్డంకులను అధిగమించడానికి గొప్ప ఆధ్యాత్మిక బలాన్ని పొందుతారు. శ్రీ లక్ష్మి నరసింహ స్వామి విగ్రహం స్వయంభుగా వెలిసిందని ప్రతీతి. నిజాం కాలంలో అక్కన్న ,మాదన్నలు ఇక్కడకు వచ్చి పూజలు చేసేవారని స్థానికులు చెబుతున్నారు. శివుడు ఇక్కడ క్షేత్రపాలకుడిగా ఉన్నాడు అందుకే లక్ష్మీనరసింహుడి విగ్రహానికి ఎదురుగా శివుని విగ్రహం ఉంటుంది. శివుడు తపస్సు చేయగా శ్రీ లక్ష్మి నరసింహ స్వామి శివుడు శిరస్సుపై శంఖం ఉంచి దీవించాడట అందుకే ఇక్కడి శివలింగంపై శంఖం ఉంటుంది కనుక పాంచజన్నేశ్వరుడిగా పేరు వచ్చింది. స్వయంభు లక్ష్మి నరసింహ స్వామి వెలసిన ప్రదేశంలో అనేక అద్భుతాలు.



**- కావ్యసుధ**
**వాఙ్మయ భూషణ, సాహితీ శిరోమణి,**
**ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్,**
**ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్**
**9247313488**

# భూపాలపల్లి జిల్లాకు 55 ప్రీ ప్రైమరీ పాఠశాలలు మంజూరు


**భూపాలపల్లి, మహా :** భూపాలపల్లి మండలంలో మంజూరైన ప్రీ ప్రైమరీ పాఠశాలలు ఇవే.సుబ్బక్క పల్లి,కొంపెల్లితండా,గొల్ల బుద్ధారం,బెడ్డలోనిపల్లి, దూదేకులపల్లి,ఎర్రయ్య పల్లి,ఫకీర్ గడ్డ, గడ్డిగానిపల్లి ,గొర్లవేడు, గుర్రంపేట,జంగేడు,కమలాపూర్,కొంపె ల్లి,కొత్తపెల్లి, కృష్ణ కాలనీ,మహబూబ్ పల్లి,మంజూరు నగర్,రామ్ నాయక్ తండ, రాంపూర్,సెగ్గంపల్లి,సు భాష్ కాలనీ,వేషాలపల్లి,గుడాడుపల్లి, కాసింపల్లి,పు ల్లూరు రామయ్యపల్లి పాఠశాలలు ఏర్పాటు చేస్తారు. చిట్యాల మండలంలో నైన్ పాక, గిద్దె ముత్తారం ఒంటిప్ప తండా, దూద్పల్లి, గణపురం మండలంలో కొండాపూర్, పరశురాంపల్లి, రంగారావుపల్లి,కర్కప ల్లి, కొత్త పెల్లి గోరి మండలంలో జగ్గయ్యపేట,కోనరావు పేట్, కొత్తపల్లి గోరి, కొత్తపల్లి,నిజాంపల్లి,వెంకటేశ్వర పల్లి, మొగుళ్లపెల్లి మండలంలో మొట్లపల్లి,రేగొండ మండలంలో రేగొండ, తిరుమలగిరి,పొనగల్లు,టేకు మట్ల మండలంలో గర్మిళ్లపల్లి, టేకుమట్ల,కాటారం మండలంలో పోతుల్వాయి, కాటారం, మహాదేవపూర్ మండలంలో కుదురుపల్లి, PSఅన్నారం,పెద్దంపే ట్,UPSఅన్నారం, కాళేశ్వరం ఎస్సీ కాలనీ,మహాము త్తారం మండలంలో మహాముత్తారం,బోర్లగూడెం, యామనపల్లి,పాఠశాలలు ఎంపికయ్యాయి

# నగరంలో కొలువుదీరిన గణనాథులు

## వాడవాడలా వైభవంగా గణేష్ నవరాత్రోత్సవాలు



**వరంగల్ మహా;** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలో బుధవారం హోమాలు ప్ర త్యేక పూజలతో విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లాలోని మండలాలు అన్ని గ్రామాలతో పాటు గ్రేటర్ వరంగల్ నగరంలో ఆయా కమిటీలు, యూత్ సంఘాలు, వివిధ సంఘాల ప్రతినిధులు, వాడవాడలా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. వరంగల్ నగరంలో పలువురు ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద రెండవ రోజు అన్నదాన కార్యక్రమాలు ప్రారం భమయ్యాయి. ఈ సందర్భంగా బిఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ క్యాంప్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని ప్రతిష్టించి నరేందర్ వాణి దంపతులు రెండవ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ తూర్పు నియోజకవర్గం లోని అన్ని వర్గాల ప్రజలు, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలుపుతూ గణేష్ గణపతి నవరాత్రులు ఎంతో వైభవంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. వరంగల్ నగరం లోని పోచమ్మ మైదాన్ పరిధిలో ఉన్న దేశాయి పేట్ రోడ్ వర్తక సంఘం శాశ్వత అధ్యక్షుడు డాక్టర్ లయన్ ఆడెపు రవీందర్, గణపతి వర్తక సంఘం, కాశిబుగ్గ వర్తక వ్యాపార సంఘాల తోపాటు కరీమాబాద్, వరంగల్ చౌరస్తా పెరుకవాడ, ఎస్ఆర్ఆర్ తోట, శివనగర్, చింతల్ రంగంపేట, హనుమకొండ నగరంలో ని అంబేద్కర్ జంక్షన్, రెడ్డి కాలనీ, సుబేదారి, కొత్తూరు, ఎన్జీవోస్ కాలనీ, లలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకు ని బుధవారం వాడవాడలా నిర్వాహకులు, ఆయా సంఘాలు, కమిటీలు, ఆయా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో గణపయ్య విగ్రహాలను ప్రతిష్ఠించారు. పలు చోట్ల మట్టి విగ్రహాలను కూడా పంపిణీ చేశారు. ముఖ్యంగా ఎల్లం బజార్ లో ఆకుతోట సంజు ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన 45 ఫీట్ల బంగారు రంగుతో కూడిన భారీ గణపతి విగ్రహం నగర ప్రజలను ఆక ట్టుకుంది.అలాగే పిన్నవారి వీధి 28వ డివిజన్‌లోని పిన్నవారివీధిలో ఫ్రెండ్స్ యూనిట్ కమిటీ సభ్యులు 43 వ సంవత్సరంలో చేస్తున్న గణపతి నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా సువర్ణ కాంప్లెక్స్‌లో భారీ సెట్టింగ్ ల మధ్య వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక కార్పొరేటర్ గందె కల్పనానవీన్ దంపతులతో పాటు కుటుంబసభ్యులు, ఫ్రెండ్స్ యూనిట్ కమిటీ సభ్యులు మొదటిరోజు విగ్రహ ప్రతిష్టాపన లో భాగంగా హోమం తో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్య క్రమంలో గందె శ్రీనాథ్, శ్రీకాంత్, పిన్న శివకుమార్, భార్గవరామ్, కల్యాణ్ బొగల్, బొడ్ల రవీంద్రనాథ్, వినోద్, విజయ్, అనిల్, నాగేందర్, మురళి, వేణు, సుధీర్, వినయ్, అనిల్, తాటికొండ రాము, పాల్గొ న్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నగరంలోని ఆయా కమిటీలు, నిర్వాహకులు మండపాల్లో విగ్ర హాల ప్రతిష్టాపన కార్యక్రమాలు, పూజలు వైభవంగా నిర్వహించారు.



# గణేశ్ నవరాత్రోత్సవాలు షురూ

**ఆమనగల్లు, మహా :** జై బోలోగణేష్ మహరాజ్‌కి జై అంటూ వినాయక చవితి పర్వదిన వేడుకలను అమనగల్లు, కడ్తల్, తలకొండపల్లి, మాడ్గుల మండ లాల్లో ఘనంగా నిర్వహించారు. పలు అసోసియేషన్ల ఆధ్వర్యంలో భారీ వినాయక విగ్రహాలను వివిధ కూ డళ్ళలో ఏర్పాటు చేశారు. ఇదే విధంగా ప్రతి ఇంటిలో వినాయకచవితి వేడుకలు నిర్వహించారు. గణపతి నవరాత్రులను పురస్కరించుకుని మండపాల వద్ద ప్రత్యేక అలంకరణలు చేసి మండపంలో ఉత్సవ కమిటీల సభ్యులు గణనాథుడిని ప్రతిష్టించారు. పలు మండపాలలో భక్తులతో పాటు స్థానిక ప్రజాప్రతిని ధులు గణనాథుడికి పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. ఏ వాడలో చూసిన గణ నాథుడి మండపాలతో కళకళలాడుతున్నాయి. వా డవాడలా ఏర్పాటుచేసిన మండపాల్లో వివిధ ప్రత్యేక ఆకృతుల్లో ఉన్న గణనాథుడి విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన మండపాల్లో ప్రత్యేక సాం స్కృతిక కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చే స్తున్నారు.ప్రతిరోజు వినాయక విగ్రహాలకు ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తున్నారు.

# మహిళా మార్ట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టండి



## నగర మేయర్ గుండు సుధారాణి

**వరంగల్ మహా;** మహిళా మార్ట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అన్నారు. గురువారం కాశీబుగ్గ సర్కిల్ ఆఫీస్ వద్ద కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయానికి మార్ట్ ఏర్పాటు కోసం క్షేత్ర స్థాయి లో పరిశీలించారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ వరంగల్ పరిధికి సంబం ధించిన కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయం లో గ్రౌండ్ ఫ్లోర్ లో గల 5 గదులను పునరుద్ధరించి, నవికరిం చి మహిళ మార్ట్ త్వరితగతిన ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏ సి పి లు ఖలీల్ ప్రశాంత్, ఇంచార్జి ఈ ఈ సంతోష్ బాబు, సూపరింటెంట్ హబీబ్ ఆర్ ఓ షెహజాది బేగం, టి పి ఎస్ లు అనిల్, శ్రీకాంత్, ఏ ఈ హబీబ్, తదిత రులు పాల్గొన్నారు. అనంతరం మేయర్ బల్దియా పరిధి 43 వ డివిజన్ మామునూరు పోలీసు శిక్షణ కళాశాలలో బల్దియా సాధారణ నిధులు రూ.91 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు, స్లాబ్ కల్వర్టు, డివైడర్ నిర్మాణ పనులకు స్థానిక వర్ధ న్నపేట శాసనసభ్యులు కె ఆర్ నాగరాజు తో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పోలీస్ ట్రైనింగ్ కళాశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, మేయర్ లు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరే టర్ అరుణ విక్టర్, పోలీసు శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ ఇంజారపు పూజ, పోలీసు అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.



## కబడ్డీపై మక్కువతో పేదింటి బిడ్డకు

# ఆర్థిక సాయం

## ఉదారతను చాటుకున్న సీఐ మద్ది మహేందర్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా మహా:** నందిని లాంటి క్రీడాకారిణి జాతీయస్థాయిలో, రాష్ట్రం నుండి కబడ్డీ పోటీల్లో పాల్గొనడం తనకు ఎంతో గర్వంగా ఉందని సిఐ అన్నారు. తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్ స్పెక్టర్ మద్ది మహేందర్ రెడ్డి కబడ్డీ ఫైట్ తనకున్న మక్కువతో పేదింటి ఆడబిడ్డకు ఆర్థిక సాయం అందించారు. ఢిల్లీలోని సోనిపాత్లో జరుగుతున్న ఇండియా కబడ్డీ క్యాంప్ కి సెలక్షన్ అయినా బండి నందిని, నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పదర అనే మారుమూల గ్రామం నుంచి నిరుపేద కుటుం బానికి చెందిన కబడ్డీ క్రీడాకారిణికి గురువారం ఢిల్లీ బయలుదేరడానికి, తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి మద్ది మహేందర్ రెడ్డి, తన సొంత డబ్బులతో విమాన టికెట్ అందించి, ఆ క్రీడాకారిణిని విమానంలో కబడ్డీ పోటీల కోసం ఢిల్లీకి పంపించడం జరిగింది. ఒక నిరుపేద అయిన కబడ్డీ క్రీడాకారిణికి ఉన్న ప్రతిభను గుర్తించి మరి విమానంలో పంపడమే కాకుండా, దారి ఖర్చులకు కూడా కొంత డబ్బులు సమకూర్చి ప్రోత్సహించ డం, చాలా సంతోషంగా ఉందని కుటుంబ సభ్యులు తల్లిదండ్రులు, తెలంగాణ రాష్ట్ర కబడ్డీ సంఘం అదృష్టంగా భావిస్తున్నాము. మాకోసం గొప్ప మన సున్న వ్యక్తి మా కోసం చేసిన సహాయాన్ని ఎప్పటికీ మరువలేనిదని, తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియే షన్ కు కార్యదర్శులు మహేందర్ రెడ్డి దొరకడం చాలా గర్వంగా ఉందని నందిని కుటుంబ సభ్యులు అన్నారు. పల్లెల్లో ఆణి ముత్యాలాంటి క్రీడాకారులు ఉన్నారు... ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్ స్పెక్టర్ మద్ది మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... క్రీడల పట్ల ఆసక్తి ఉన్నవారికి ప్రోత్సహించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. వాళ్ళ ప్రతిభ ఆదిలోనే అంతం కాకుండా దేశం కోసం ఆడాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో రావాలని ఆయన తెలిపారు. పల్లెల్లో ఆణి ముత్యాలాంటి క్రీడాకారులు ఉన్నారని, ఆర్థిక కొ రవడితో జాతీయస్థాయిలో, రాష్ట్రస్థాయిలో రాణిం చలేక పోతున్నారని, వారికి తగిన ఆర్థిక సాయం చేస్తూ ప్రోత్సహించాలని పలువురిని కోరారు. నందిని లాంటి క్రీడాకారిణి జాతీయస్థాయిలో, రాష్ట్రం నుండి కబడ్డీ పోటీల్లో పాల్గొనడం తనకు ఎంతో గర్వంగా ఉందని, ఇలాంటి ప్రతిభను కన బరిచిన ప్రతి ఒక్కరికి, తన శక్తి మేర కృషి చేస్తానని సిఐ అన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ



**షాద్ నగర్, మహా:** వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ వెంకటేశ్వర్లు..గురువారం షాద్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు పెరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల ముందస్తు కేసులను గుర్తించడానికి మరియు ప్రజలకు అవగాహన కల్పిం చడానికి అంతటా ఇంటింటి సర్వేలు ప్రారంభిస్తామని చెప్పారు.వైద్యం కోసం వచ్చే రోగులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భారీ వర్షాల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ ఆరోగ్య శాఖను అప్రమత్తం చేయడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా ఈగలు దోమల వల్ల మలేరియా, డెంగ్యూ,టైఫాయిడ్ వంటి విషపూరిత జ్వరాలు వస్తు న్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య శాఖ పరిధిలో అందరికీ సెలవులు రద్దు చేయడం జరిగిందని తెలియజేశారు. ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఎక్కడ మందుల కొరత లేకుండా అన్ని సెంటర్లలో మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రులను సద్వి నియోగం చేసుకోవాలని కోరారు పరిసరాల్లో ఎక్కడ నీరు నిలవకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.ప్రతి గ్రామంలో పంచాయతీల సమన్వయంతో ఆరోగ్య కార్యకర్తలు పనిచేసేలా చూసుకుంటున్నామని 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఆరోగ్య కార్యకర్తలు ఉంటారని అన్నారు. ముఖ్యంగా పసిపిల్లలు,గర్భిణీలు, వృద్ధులు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ముఖ్యంగా ప్రైవేట్ హాస్పిటల్స్ కు వెళ్లకూడదని ప్రభుత్వ హాస్పిటల్లో అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ప్రైవేట్ హాస్పటలను సంప్రదించి అప్పుల పాలు కావద్దని ఇల్లు గుల్ల చేసుకోవద్దని కోరారు. ఈ ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యం వారు ఐ జి జి, ఐ జి ఎం, ఎలిసా పరీక్షలు చేయించుకున్న తర్వాత అందులో పాజిటివ్ అని నిర్ధారణ అయితేనే డెంగ్యూ కేసుగా వ్య వహరించాలని రక్తంలో ప్లేట్లెట్స్ తగ్గినంతమాత్రాన డెంగ్యూ కేసులుగా చూడొద్దని కోరారు. ప్రతి ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్రంలో ఉచిత టెస్టులు చేయించుకొని వ్యాధిని నిర్ధారించుకోవాలని అన్నారు. ఆర్ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేయకూడదని అలా చేసే కఠి నమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. షాద్నగర్ డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ విజయలక్ష్మి, హాస్పిటల్ సూపరిండెంట్ విష్ణువర్ధన్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



## బాధ్యతలు స్వీకరించిన

# ఆమనగల్లు తహసీల్దార్ మహ్మద్ ఫయిమ్ ఖాద్రి

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు నూతన తహసీల్దా ర్ గా మహ్మద్ ఫయిమ్ ఖాద్రి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ బాధ్యతలు నిర్వర్తించిన తహసీల్దార్ ఓ రైతు నుండి లంచం తీసుకోవడంతో ఇటీవలే ఏసిబి అధికారులకు పట్టుబడిన విషయం విధితమే.. ఆమె స్థానంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ యుఎల్ సి సూపరిండెంటెంట్ గా పనిచేస్తున్న మహ్మద్ ఫయిమ్ ఖాద్రి ఆమనగల్లు మండల నూతన తహసీల్దార్ గా గురువారం బాధ్యతలు తీసుకున్నారు.. మండలవాసు లకు భూభారతి, ఇతర సర్టిఫికెట్లు, వివిధ అవసరాల కోసం వచ్చేవారు నేరుగా తనను కలవొచ్చని, మధ్యవ ర్తుల ప్రమేయం లేకుండా నేరుగా తనను సంప్రదించా లని సూచించారు. సమస్యలు పరిష్కరించే విధంగా మెరుగైన సేవలను అందేలా తనవంతు సహకారం అందిస్తానని ఫహీమ్ ఖాద్రి చెప్పారు. డిప్యూటీ తహ సీల్దార్ తో పాటు ఆర్ఐలు, సిబ్బంది, శెట్టిపల్లి యువ నాయకులు బొచ్చుపల్లి రాకేష్ రావు మర్యాదపూర్వ కంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# మైనార్టీ గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యే





**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలం లోని జక్కలొద్ది మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు లతో కలసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భవనంలోని డార్మెంటరి, భోజన శాల, తరగతి గదులను పరిశీలించారు. వర్షాల ప్ర భావంతో భవనం పై నుండి నిలిచి ఉన్న వర్షపు నీరు కారుతున్న నీటిని పరిశీలించి భవన మరమ్మతులు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశిం చారు. విద్యార్థుల యోగ క్షేమాల తో పాటు వారికి కావలసిన అవసరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వివిధ సబ్జెక్టుల పఠన సామర్థ్యాన్ని పరి శీలించి, విద్యార్థులతో కలిసి వారు భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ అధికారులు, ఈ ఈలు, ఇతర అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ముంపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## ముంపు ప్రాంతాల్లో పర్యటించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ మహా;** భారీ వర్షాలు నేపథ్యంలో వరంగల్ నగరంలోని దేశాయి పేట చిన్న వడ్డేపల్లి చెరువు, దామెర చెరువులను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గురువారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా అధికారులతో కలిసి సందర్శించా రు. రెవెన్యూ, మున్సిపల్ అధికారుల నుంచి చెరువుల ప్రస్తుత పరిస్థితి గురించి వివరాలు తెలుసుకున్నా రు. చెరువుల నీటి మట్టాన్ని తరచుగా పరిశీలిస్తూ, ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమై తే సురక్షిత ప్రదేశాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎటువంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే స్పందించి ప్రజల ప్రాణాల తోపాటు ఆస్తులను కాపాడే లా జాగ్రత్తలు తీ సుకోవాలని డాక్టర్ కావ్య స్పష్టం చేశారు. అనంతరం ఎనుమాముల, ఎస్. ఆర్ కాలనీ 14వ డివిజన్ లో పర్య టించి స్థానిక ప్రజాలతో ఎంపీ మాట్లాడారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అండగా ఉందని, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి మీ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, ఇరిగేషన్ మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

# గణనాధునికి ప్రత్యేక పూజలు



**రాజేంద్రనగర్, మహా ;** మైలా ర్దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని రాజేంద్ర నగర్ నియోజకవర్గ ఇంచార్జ్, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి బిజెపి నాయకులతో కలిసి భక్తులకు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. అనంతరం కాటేదాన్ బీజేపీ పార్టీ కార్యాలయంలో బుధవారం గణనాథునికి ప్రత్యేక పూజలు, నిర్వహించారు. కార్పొరేటర్ స్థానిక ప్ర జలందరికీ వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ పరిర క్షణ కు అందరూ మట్టి వినాయకులను ప్రతిమల నే ప్రతిష్టించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజలందరూ శాంతి యుత వాతావరణం లో గణేష్ పండుగను జరుపుకోవాలని తెలిపారు. విఘ్నేశ్వరుడి చల్లని ఆశీస్సులు దీవెనలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గోదా పాండు యాదవ్, బిజెపి నాయకులు ఆడికే జనార్ధన్, నవారు మురళీధర్ రెడ్డి, రమేష్ రెడ్డి, శానిటేషన్ ఇన్స్పెక్టర్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనాల నేపథ్యంలో షాద్ నగర్‌లో చెరువుల పరిశీలన



**షాద్ నగర్, మహా:** వినాయక చవితి నవరాత్రులలో నేపథ్యంలో చెరువుల్లో గణేష్ నిమ జ్జన కార్యక్రమాలను సురక్షితంగా ఏర్పాటు చేసేందుకు షాద్ నగర్ పోలీసు శాఖ ఆధ్వ ర్యంలో శంషాబాద్ డిసిపి రాజేష్, షాద్ నగర్ ఏసిపి ఎస్ లక్ష్మీనారాయణ, పట్టణ సిఐ విజయ్ కుమార్ తదితరులు పలు చెరువులను సందర్శించారు. నవరాత్రుల ముగింపు అనంతరం ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయకులను నిర్వాహకులు ఆయా ప్రాంతాల వారిగా చెరువులను విభజించి వాటిని నిమజ్జనం చేసే విధంగా ఏర్పాట్లు చేసేందుకు అధికారులు రూట్ మ్యాప్ నిర్ధారిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి అవ చనియ సంఘటనలు అదేవిధంగా చెరువులలో సమృద్ధిగా నీరు ఉండడంతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నిమజ్జనానికి అనువుగా ఉన్న చెరువులను కొండలను డిసిపి రాజేష్ పరిశీలించారని స్థానిక సీఐ విజయకుమార్ తెలిపారు.

# ఎమ్మెల్యే నాయిని అవగాహన లేని వ్యక్తి

## బిజెపి జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్




ఎంజీఎం ఆసుపత్రి, వరంగల్ బస్టాండ్ కనిపించడం లేదా..

**వరంగల్ మహా;** వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అవగాహన లేని వ్యక్తి అని, అభివృద్ధి చేయడం చేతకాక కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం ఆయన అవి వేకానికి నిదర్శనమని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ విమర్శించారు. ఈ సందర్భంగా గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10మంది కాంగ్రెస్ ఎమ్మె ల్యేలు, ఇద్దరు మంత్రులు ఉండీ ఏం లాభమని ప్రశ్నిం చారు. ఉమ్మడి వరంగల్‌లో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదని ఓ వైపు వరంగల్ అభివృద్ధికి కేంద్రం స్మార్ట్ సిటీ కింద నిధులు మంజూరు చేస్తుంటే, రాష్ట్రం లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఒక్కపైసా కూడా తేలేని పరిస్థితిలో నాయకులు ఉన్నారని మండిపడ్డారు.

**నాయిని బీసీలకు మాత్రమే 42శాతం ఇస్తే స్వాగతిస్తాం..**

బీసీ రిజర్వేషన్‌పై నాయిని రాజేందర్‌రెడ్డికి ఏమైనా అవగాహన ఉందా అంటూ గంట రవికుమార్ ప్ర శ్నించారు. కేవలం బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తే స్వాగతిస్తామని, కాంగ్రెస్ కుట్ర పూరితంగా 10శాతం ముస్లింలను కలుపుకుని అంతా బీసీ రిజ ర్వేషనే అంటూ నాయిని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయిని బండి సంజయ్‌ను వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని గంట రవికుమార్ సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రధాన కేంద్రంగా ఉన్న పశ్చిమ నియో జకర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయిని రాజేందర్‌రెడ్డి ఇక్కడ జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. కాజీపేట దర్గా, హనుమకొండ జైన్‌మందిర్ గుట్టకు స్మార్ట్ సిటీ కింద నిధులు కేంద్ర ఇచ్చిన విషయం మరిచారా అంటూ ప్రశ్నించారు? ఎంజీఎం ఆస్పత్రి దయనీయంగా మారినా నాయినికి కనిపించడం లేదా అని గంట నిలదీశారు. భవనం పెచ్చులూడుతున్నాయని, కనీసం ఫ్యాన్లు కూడా లేకపోవడంతో రోగుల ఇంటి నుంచి ఫ్యాన్లు తెచ్చుకుంటున్న విషయం కనిపిం చడం లేదా అన్నారు. రాష్ట్రంలో మీరే అధికారంలో ఉన్నారు కదా.. వరంగల్ బస్టాండ్ నిర్మాణం కోసం ఎందుకు కృషి చేయడం లేదని సూటిగా ప్రశ్నించా రు. ఎంజీఎం, వరంగల్ బస్టాండ్ నిర్మాణంపై బీజేపీ ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసనలు చేసినా పట్టించుకో వడం లేదని అన్నారు.

**ఓట్ల గల్లంతుపై తోకముడిచిన రాహుల్ గాంధీ..**

బీహార్‌లో ఓట్ల గల్లంతుపై ఇష్టారాజ్యంగా మాట్లాడు తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గల్లంతైన వారి వివరాలు ఇవ్వాలని ఎలక్షన్ కమిషన్ కోరినా తోక ముడిచి.. ఓట్ చోర్ అంటూ బీజేపీ పై వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అని గంట రవికుమార్ అన్నారు. నిజానికి కాంగ్రెస్సే మతతత్వ పార్టీ అని విమర్శించా రు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, వన్నాల వెంకటర మణ, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకుల రఘునారెడ్డి, జిల్లా కా ర్యదర్శి గోకే వెంకటేష్, కోశాధికారి కూచన క్రాంతి కుమార్, అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్, ప్రచార కార్యదర్శి బైరి శ్యాంసుదర్, కార్యాలయ కార్యదర్శి పెద్ది నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# తాత్కాలిక స్పోర్ట్స్ స్కూల్‌కు ఏర్పాట్ల పరిశీలన

## 31వ తేదీలోగా వసతులు పూర్తి చేయాలి.. హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



**హన్మకొండ మహా ;** హనుమకొండ లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ప్రారంభానికి అవసరమైన తాత్కాలిక సదుపాయాలను గురువారం కలెక్టర్ స్నేహ శబరీష్ క్షేత్ర స్థాయిలో పర్యటించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియం ఆవరణలో ఉన్న హాస్టల్ భవనాలు, అవుట్ డోర్, క్రీడా మైదానాలను పరిశీలిం చి వాటిలో చేపట్టాల్సిన మరమ్మత్తులు, కల్పించాల్సిన సదుపాయాలను విద్యార్థులకు క్రీడా సదుపాయాలు ఈనెల 31వ తేదీలోగా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా డివైఎస్ఓ అశోక్ కుమార్ ను ప్రస్తుతం ఏర్పాటు చేసిన మౌలిక వసతుల గురించి చర్చించారు. అలాగే జేఎన్ఎ స్ స్టేడియం ఆవరణలో విద్యార్థులకు హాస్టల్ వసతిలో ఉండాల్సిన సదుపాయల కల్పనకు, ఇండోర్, అవుట్ డోర్ క్రీడా సదుపాయాలు, పరికరాల ఏర్పాటుకు, అవసరమైన మరమ్మత్తులకు వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్య క్రమంలో అధికారులు ఇ.ఇ. ఆర్అండ్ బీ సురేష్, నరేందర్ రెడ్డి, కోచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌పై టారిఫ్‌ల ఎఫెక్ట్: కంపెనీల దివాళా, లక్షల ఉద్యోగాలు ఉష్‌కాకి!!

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ విధింపులపై ప్రముఖ భారత మార్కెట్ నిపుణులు అజయ్ బగ్గా హెచ్చరికలు జారీ చేశారు. నేటి నుంచి అమల్లోకి వచ్చిన కొత్త టారిఫ్‌లతో సంస్థలు దివాళా తీయడం, వాటిల్లో పనిచేస్తున్న సిబ్బంది ఉద్యోగాలు కోల్పోయేందుకు దారితీయనుందని అన్నారు. రష్యా నుంచి ముడిచమురు కొంటున్న భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు అమెరికా 50శాతం విధించిన అదనపు సుంకాలు నేటి నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ తాజా పరిణామాలపై మార్కెట్ నిపుణులు అజయ్ బగ్గా స్పందించారు. అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువులపై భారత్ 50శాతం టారిఫ్ చెల్లిస్తోంది. వీటివల్ల భారత్‌పై కొంతకాలం ప్రతికూల ప్రభావం పడుంది. పలు సంస్థలు దివాళా తీయోచ్చు. షార్ట్ టర్మ్ ఉద్యోగాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందనే అంచనా వేశారు. అదనపు టారిఫ్ కారణంగా భారత్ ఉత్పత్తి రంగంపై 30 నుంచి 40 బిలియన్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అజయ్ బగ్గా అభిప్రాయం వ్యక్తం చేశారు. దీని ఫలితంగా సమీప భవిష్యత్తులో భారతదేశ జీడీపీ 0.5 శాతం నుంచి 1శాతం వరకు తగ్గుతుంది. రూ.5.25 లక్షల కోట్లు నష్టం వాటిల్లనుంది. అలా అని పరిస్థితులు ఇలాగే స్థిరంగా ఉంటాయా? అని ప్రశ్నిస్తే.. లేదనే సమాధానం చెబుతున్నారు. రష్యా నుంచి ముడిచమురు కొంటున్న భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు అమెరికా ఆగస్టు 7న నుంచి 25శాతం అదనపు సుంకాలు విధించింది. నేటి నుంచి మరో 25శాతం అదనపు



సుంకాలు.. మొత్తంగా 50శాతం అదనపు సుంకాలు చెల్లిస్తూ భారత్ ప్రపంచంలోనే అత్యధిక పన్ను చెల్లిస్తున్న దేశాల జాబితాలో చేరినట్లైంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం కొనసాగుతోంది. ఈ యుద్ధం కొనసాగేందుకు రష్యా నుంచి భారత్ ముడిచమురు కొనుగోళ్లే కారణమని ట్రంప్ ఆరోపించారు. ఆ కొనుగోళ్లను ఆపకపోతే భారత్ ఎగుమతులపై సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. అయితే, ట్రంప్ హెచ్చరికల్ని భారత్ భేఖాతరు చేసింది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను కొనసాగిస్తూ వస్తోంది. ఈ క్రమంలో భారత్ నిర్ణయంపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనపు టారిఫ్ చెల్లించాలని ప్రకటించారు. దీంతో అమెరికా విధించిన అదనపు సుంకాలు నేటినుంచి అమల్లోకి వచ్చాయి. ఆ దేశ కాలమానం ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి దాటాక బుధవారం తెల్లవారుజామున 12.01 గంటల (భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 9.30 గంటలు) నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో గతంలో విధించిన 25 శాతానికి అదనంగా మరో 25 శాతం కలిపి భారత్ ఎగుమతులపై 50శాతం భారం పడుతోంది.

# హైదరాబాద్‌లో ఇంటర్‌నెట్ అంతరాయం.. సెల్యులార్ ఆపరేటర్ల ఆగ్రహం


**హైదరాబాద్:** నగరంలోని పలు ప్రాంతాల్లో టీజీఎస్పీడీసీఎల్ సిబ్బంది కొనసాగిస్తున్న, చట్టవిరుద్ధమైన ఫైబర్ కోతలను సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఓఏఐ) ఖండించింది. ఆగస్టు 22న తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును ధిక్కరిస్తూ ఈ చర్యలు కొనసాగుతున్నాయని అసోసియేషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. నగరంలోని బంజారాహిల్స్, కూకట్ పల్లి, మాదాపూర్, కొండాపూర్, హబ్సిగూడ, చంపాపేట్, మణికొండ, సికింద్రాబాద్, కొంపల్లి తదితర ప్రాంతాల్లో ఫైబర్ కోతలు ఎక్కువగా నమోదవుతున్నాయని, దీంతో టెలికాం ఫైబర్ తెగిపోవడంతో ఇంటర్నెట్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని సీఓఏఐ తెలిపింది. గత కొన్ని రోజులుగా ఇది పరిస్థితిని మరింత దిగజార్చిందని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైన కనెక్టివిటీపై ప్రభావం చూపుతోందని తెలిపింది. ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ పై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని ఆగస్టు 25న టీజీఎస్పీడీసీఎల్ కు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను



పొడిగించినప్పటికీ, మళ్లీ ఫైబర్ కోతలతో ఈ ఉత్తర్వును స్పష్టంగా ఉల్లంఘిస్తూనే ఉందని సీఓఏఐ ఆక్రోశించింది. టెలికమ్యూనికేషన్స్ యాక్సెస్ అనేది కేవలం ఒక సేవ మాత్రమే కాదని, ఇది నేటి డిజిటల్ యుగంలో ప్రాథమిక హక్కు, జీవనాధారమని సీఓఏఐ తెలిపింది. కోర్టు ఆదేశాలను అమలు చేయడానికి, కీలకమైన టెలికాం మౌలిక సదుపాయాల రక్షణను నిర్ధారించడానికి, ఈ పునరావృత ఉల్లంఘనలకు పాల్పడినవారిని చట్ట ప్రకారం బాధ్యులను చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని అసోసియేషన్ ప్రకటనలో కోరింది.

# భార్యతో కలిసి ఇన్వెస్ట్ చేసే పోస్టాఫీసు ప్రత్యేక స్కీమ్..


అసలుకు ఎటువంటి రిస్క్ లేకుండా మంచి రాబడినిచ్చే పొదుపు పథకాలు పోస్టాఫీసుల్లో ఎన్నో ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఈ ఏడాది రెపో రేటును 1 శాతం తగ్గించింది. ఫిబ్రవరి, ఏప్రిల్, జూన్ నెలల్లో వరుసగా కోతలు విధించింది. దీనికి అనుగుణంగా బ్యాంకులు కూడా పొదుపు ఖాతాలపై వడ్డీని బ్యాంకులు తగ్గించాయి. కానీ పోస్టాఫీసుల్లో పథకాల వడ్డీ రేట్లు మాత్రం మారలేదు. సురక్షితమైన పెట్టుబడితో ప్రతి నెలా స్థిర ఆదాయం కోరుకునే వారి కోసం పోస్టాఫీసులో అద్భుతమైన పథకం ఉంది. అదే పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ (ఎంఐఎస్) ఈ పథకంలో ఒకసారి ఏకమొత్తంలో మొత్తంలో పెట్టుబడి పెడితే దానిపై వడ్డీ ప్రతి నెలా వారి పొదుపు ఖాతాలో నేరుగా జమవుతుంది. ఈ పథకం 5 సంవత్సరాల పాటు ఉంటుంది. మెచ్యూరిటీ తర్వాత




అసలు మొత్తం తిరిగి లభిస్తుంది. ఈ స్కీమ్‌లో ఒకే ఖాతా ద్వారా గరిష్టంగా రూ.9 లక్షలు డిపాజిట్ చేయొచ్చు. అదే జాయింట్ అకౌంట్ ద్వారా అయితే రూ.15 లక్షల వరకు ఇన్వెస్ట్ చేయవచ్చు. పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ 7.4% వార్షిక వడ్డీని (ఆగస్టు 2025 నాటికి) అందిస్తుంది. పెట్టుబడి పూర్తిగా సురక్షితం. ప్రతి నెలా గ్యారెంటీ వడ్డీని ఇస్తుంది. ఉదాహరణకు భార్యభర్తలిద్దరూ కలిసి ఉమ్మడి ఖాతాలో రూ .15 లక్షలు పెట్టుబడి పెడితే ప్రతి నెలా సుమారు రూ .9,250 వడ్డీ వస్తుంది. ఈ పథకం ప్రత్యేకమైనది ఎందుకంటే దాని వడ్డీ రేటు స్థిరంగా, బ్యాంకు కంటే ఎక్కువగా ఉంటుంది. దీనికి ప్రభుత్వం కూడా మద్దతు ఇస్తుంది కాబట్టి పెట్టుబడి చాలా సురక్షితం. ప్రతి నెలా నిర్ణీత మొత్తాన్ని పొందడం వల్ల క్రమం తప్పకుండా ఆదాయం లభిస్తుంది.

# వాటర్ ప్యూరిఫయర్స్‌పై జీఎస్టీ తగ్గించండి: ఆర్థికశాఖకు వినతి

**న్యూఢిల్లీ:** నీటి శుద్ధి యంత్రాలు, వాటి ఫిల్టర్లు, సంబంధిత సేవలపై ప్రస్తుతం ఉన్న 18% జీఎస్టీని 5%కి తగ్గించాలని వాటర్ క్వాలిటీ ఇండియా అసోసియేషన్ కోరింది. ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వ శాఖకు ఒక లేఖ రాసింది. నీటి శుద్ధి యంత్రాలను సామాన్యులకు మరింత అందుబాటులోకి తీసుకురావడమే దీని వెనుక ముఖ్య ఉద్దేశమని ఆ లేఖలో పేర్కొంది. సురక్షితమైన తాగునీటిని విలాసవంతమైన వస్తువుగా కాకుండా నిత్యావసర వస్తువుగా పరిగణించాలని కోరింది. నీటి శుద్ధి యంత్రాలపై 18% జీఎస్టీ విధించడం వల్ల అవి




ఎయిర్ కండిషనర్లు, కార్ల మాదిరిగా అధిక పన్ను పరిధిలోకి వస్తున్నాయి. అయితే, ఇవి ప్రజల ఆరోగ్యానికి అత్యంత అవసరం అని వాటర్ క్వాలిటీ ఇండియా అసోసియేషన్ వాదించింది. దేశంలో ఎలక్ట్రిక్ వాటర్ ప్యూరిఫైయర్లను ఉపయోగించే కుటుంబాల శాతం కేవలం 6% మాత్రమే ఉందని, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఇది దాదాపు 20%గా ఉందని గుర్తు చేసింది. అధిక జీఎస్టీ రేటు తక్కువ, మధ్య ఆదాయ వర్గాల ప్రజలకు వీటిని కొనేందుకు అడ్డంకిగా మారిందని తెలిపింది. 20 లీటర్ల వాటర్ జార్‌లపై ప్రస్తుతం 12% జీఎస్టీ ఉన్నప్పటికీ, అది 5%కి తగ్గించవచ్చని భావిస్తున్నారు. అదే సమయంలో నీటి శుద్ధి యంత్రాలపై పన్ను 18% వద్దే ఉండటం విధానపరమైన వైరుధ్యాన్ని సృష్టిస్తుందని అసోసియేషన్ పేర్కొంది.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# ఇక చాలు దయచేయండి.. విదేశీ విద్యార్థులపై ట్రంప్ మరో పిడుగు


**వాషింగ్టన్:** అమెరికాలో చదువుల కోసం ప్రయత్నిస్తున్న, అగ్రరాజ్యంలో ఉంటున్న విదేశీ విద్యార్థులకు అమెరికా ప్రభుత్వం భారీ షాకిచ్చింది. ఇప్పటికే వీసాల జారీకి 'సోషల్ మీడియా వెట్టింగ్'ను కఠినంగా అమలుచేస్తోన్న అగ్రరాజ్యం.. తాజాగా విద్యార్థుల వీసా నిబంధనల్లో మార్పులకు శ్రీకారం చుట్టింది. ఫలితంగా ఇకపై విదేశీ విద్యార్థులు నాలుగేళ్లకు మించి అమెరికాలో ఉండకుండా వీసా నిబంధనల్లో మార్పులు చేసే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. 1978 నుండి అందుబాటులో ఉన్న ఎఫ్1 వీసా ఉన్న విద్యార్థులు "డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్" ఆధారంగా అమెరికాలో ఉండే అవకాశం ఉండేది. అంటే వారు పూర్తి కాలం చదువుతున్నంత కాలం ఉండొచ్చు. అంటే ఒక కోర్స్ పూర్తయిన మరో కోర్సులో చేరి అక్కడే ఉండొచ్చు. కానీ కొత్త ప్రతిపాదనల ప్రకారం.. విద్యార్థులు తమ విద్యను పూర్తి చేసిన తర్వాత వారి సొంత దేశానికి వెళ్లాల్సి ఉంటుంది. ఇందుకోసం గరిష్టంగా నాలుగేళ్ల గడువు విధించింది. ఒకవేళ నాలుగేళ్ల తర్వాత కూడా అమెరికాలో ఉండాలనుకుంటే విద్యార్థులు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోం ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) ద్వారా పునఃపరిశీలన కోసం దరఖాస్తు చేయాలి. ఎఫ్1 విద్యార్థులు చదువు పూర్తి చేసుకున్న తర్వాత మరో వీసా కోసం ప్రయత్నించాలనుకుంటే.. ఆ గ్రేస్ పీరియడ్‌ను




60 రోజుల నుంచి 30 రోజులకు కుదించారు. ఈ మార్పులు అమల్లోకి వస్తే భారతీయ విద్యార్థులపై అధిక ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రస్తుతం 3.3 లక్షల మందికి పైగా భారతీయులు అమెరికా వర్సిటీల్లో చదువుకుంటున్నారు.

# బీజేపీ-ఆర్ఎస్ఎస్ వైరం

## మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు



**ఢిల్లీ:** కేంద్రం, ఆర్ఎస్ఎస్ మధ్య ఎలాంటి విభేదాలు లేవని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని విషయాల్లో అభిప్రాయ బేధాలు ఉండొచ్చు.. వివాదం కాదంటూ చెప్పుకొచ్చారు. దేశ ప్రయోజనాలే ఇద్దరి ప్రాధాన్యతగా పేర్కొన్న మోహన్ భగవత్.. బీజేపీ అధ్యక్షుడి ఎన్నికను ఆర్ఎస్ఎస్ శాసించదన్నారు. ''మేం సలహా ఇవ్వగలం .. తుది నిర్ణయం వారిదే. నూతన విద్యా విధానానికి మేం మద్దతిస్తున్నాం. ఇంగ్లీష్ నేర్చుకోవడంలో తప్పులేదు'' అంటూ ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీ తరపున ఆర్ఎస్ఎస్ నిర్ణయాలు తీసుకుంటుందని ప్రతిపక్షాల నుండి వస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్రాలతో తమకు మంచి సమన్వయం ఉందని మోహన్ భగవత్ వెల్లడించారు. అంతర్గత వైరుధ్యాలు ఉన్న వ్యవస్థలు ఉన్నాయని.. అయితే ఏ విధంగానూ వివాదం లేదన్న ఆయన.. ప్రతి ప్రభుత్వంతో తమకు మంచి సమన్వయం ఉందంటూ పేర్కొన్నారు. ''మనం రాజీ గురించి మాట్లాడినప్పుడు, పోరాటం తీవ్రమవుతుంది. అభిప్రాయాలు ఉండవచ్చు, కానీ మేం చర్చించుకుంటాం. సమష్టిగా నిర్ణయం తీసుకుంటాం. ఆర్ఎస్ఎస్, బీజేపీలు 'ఒకరినొకరు విశ్వసిస్తాయి'' అని మోహన్ భగవత్ పేర్కొన్నారు.

# విజయనగరం ఉగ్ర కుట్ర కేసులో మరో కీలక నిందితుడు అరెస్ట్

**ఢిల్లీ:** విజయనగరం ఉగ్ర కుట్ర కేసులో మరో కీలక నిందితుడిని ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. బిహార్‌కు చెందిన ఆరిఫ్ హుస్సేన్ అలియాస్ అబూ తాలిబ్ ను ఎన్ఐఏ అదుపులోకి తీసుకుంది. దేశం విడిచి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఆరిఫ్ హుస్సేన్‌ను ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. రేపు (శుక్రవారం) విశాఖపట్నం ఎన్ఐఏ కోర్టులో ఆరిఫ్ హుస్సేన్‌ను హాజరుపర్చనున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉగ్రదాడులు చేసేందుకు ఆయుధాలను సమకూర్చుతున్న ఆరిఫ్.. దేశంలో ఉంటూ జిహాదీ కార్యకలాపాలు నిర్వహించేందుకు సిద్ధమైనట్లు ఎన్ఐఏ గుర్తించింది. సిరాజ్, సమీర్ అరెస్టుల తర్వాత దేశం విడిచి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఇవాళ (గురువారం) ఆరిఫ్‌ను




ఎన్ఐఏ అరెస్టు చేసింది. ఉగ్ర వాదులు సిరాజ్, సమీర్లతో కలిసి పని చేసిన ఆరిఫ్.. ఐడీల ద్వారా ఉగ్రదాడులు చేసేందుకు కెమికల్స్‌ను తీసుకెళ్తుండగా సమీర్, సిరాజులను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

# వరద బీభత్సం..

## హైవేపై 50 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్

ఉత్తరాదిని భారీ వర్షాలు వణికిస్తున్నాయి. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లో వరద బీభత్సం సృష్టిస్తోంది. పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో రహదారులు ధ్వంసమయ్యాయి. ఛండీగఢ్‌కులుమనాలీ జాతీయ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. జాతీయ రహదారిపై 50 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రధానంగా ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతానికి పండ్లు, కూరగాయలు తీసుకెళ్తున్న వందలాది ట్రక్కులు నిలిచిపోయాయి. హైవేపై చిన్న వాహనాలకు అధికారులు అనుమతి ఇచ్చినప్పటికీ.. భారీ ట్రక్కులను నిలిపివేశారు. ఆపిల్, టమాటా, ఇతర కూరగాయల లోడ్లు పాడవుతున్నాయని ట్రక్కు డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ట్రక్కు లోడ్ విలువ లక్షల్లో ఉంటుందని డ్రైవర్లు చెబుతున్నారు. మండికుల్లు మధ్యలో కొండచరియల విరిగి పడటంతో సహాయక పనులు చేపట్టారు. క్లియరెన్స్ పనులు కారణంగా ట్రాఫిక్‌కు ఆలస్యమవుతోంది. బియాస్ నది ఉధృతంగా ప్రవహించడం వల్ల జాతీయ రహదారిలో పలు ప్రాంతాల్లో నష్టం వాటిల్లింది. మరమ్మతులు కొనసాగుతున్నాయి. కుల్లు ప్రాంతంలోని రామశిల సమీపంలో వరదల ప్రభావంతో ఇళ్లు భారీగా



దెబ్బతిన్నాయి. మనాలి ఒక వైపు నుండి ఇతర ప్రాంతాలతో ఉన్న రవాణా సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. మంగళవారం సాయంత్రం నుండి హిమాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వందలాది రహదారుల్లో రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్, నీటి సరఫరా వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జూన్ 20 నుంచి ఇప్పటివరకు, భారీ వర్షాలు, వరదలు కారణంగా సుమారుగా 158 మంది మరణించగా.. 38 మంది గల్లంతయ్యారు.. రూ. 2,623 కోట్లకు పైగా నష్టం వాటిల్లింది.

# టీవీఎస్ కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ లాంచ్..



టీవీఎస్ మోటార్ కంపెనీ తన లేటెస్ట్ ఎలక్ట్రిక్ స్కూటర్ టీవీఎస్ ఆర్బిటర్ ను లాంచ్ చేసింది. సెగ్మెంట్ ఫస్ట్ ఫీచర్లతో దీన్ని మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీని ధర రూ .99,900 (ఎక్స్‌షోరూమ్, పీఎం ఈడ్రైవ్ స్కీమ్, బెంగళూరు, న్యూఢిల్లీతో సహా). దీన్ని ఒక్కసారి ఛార్జ్ చేస్తే 158 కిలోమీటర్ల ఐడీసీ రేంజ్‌ను అందిస్తుంది. ఆర్బిటర్ 3.1 కిలోవాట్ల బ్యాటరీతో పనిచేస్తుంది. ఇందులో 14 అంగుళాల ఫ్రంట్ వీల్, క్రూయిజ్ కంట్రోల్, హిల్ హోల్డ్ అసిస్ట్, రీజెనరేటివ్ బ్రేకింగ్, రెండు హెల్మెట్లు పట్టేంత 34 లీటర్ల పెద్ద బూట్ స్పేస్ ఇందులో ఉన్నాయి. కనెక్టెడ్ యాప్, టర్న్ బై టర్న్ నావిగేషన్, జియో ఫెన్సింగ్, టైమ్ ఫెన్సింగ్, క్రాష్/ఫాల్ అలర్ట్స్, యాంటీ థెఫ్ట్ నోటిఫికేషన్లు, ఓటీఏ (ఓవర్ ది ఎయిర్) సాఫ్ట్‌వేర్ అప్డేట్స్ ద్వారా స్మార్ట్‌ఫోన్ ఇంటిగ్రేషన్‌ను ఈ స్కూటర్ అందిస్తోంది. కలర్ ఎల్‌సీడీ క్లస్టర్ కాల్స్, మెసేజ్‌లు, పర్సనలైజ్డ్ అలర్ట్ లను ప్రదర్శిస్తుంది. పొడవైన 845 ఎంఎం ఫ్లాట్ ఫార్మ్ సీట్, స్ట్రెయిట్ లైన్ ఫుట్ బోర్డ్, నిటారుగా ఉండే హ్యాండిల్ బార్ తో డిజైన్ చేసిన ఈ ఆర్బిటర్ రైడర్ కంఫర్ట్, ఎర్గోనామిక్స్ కు ప్రాధాన్యమిస్తుంది. ఎల్ఈడీ లైటింగ్, ఎమర్జెన్సీ నోటిఫికేషన్స్, లైవ్ ట్రాకింగ్, టోయింగ్ అలర్ట్స్, 169 ఎంఎం గ్రౌండ్ క్లియరెన్స్ వంటి ఫీచర్లు ఈ ఎలక్ట్రిక్ స్కూటర్లో ఉన్నాయి. ఆర్బిటర్ నియాన్ సన్బర్స్ట్, స్ట్రాటోస్ బ్లూ, లూనార్ గ్రే, స్టెల్లార్ సిల్వర్, కాస్మిక్ టైటానియం, మార్స్ కాపర్ అనే ఆరు కలర్ ఆప్షన్లలో లభిస్తుంది.

## అంచనాలు పెంచేసిన మిరాయ్ ట్రైలర్..



యంగ్ హీరో తేజ సజ్జా హీరోగా నటించిన 'మిరాయ్' ట్రైలర్ వచ్చేసింది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం సెప్టెంబర్ 12న విడుదల కానుంది. పాన్ ఇండియా రేంజ్‌లో ఈ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇందులో రితికా నాయక్ హీరోయిన్‌గా, మంచు మనోజ్ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రియా శరణ్, జయరాం, జగపతిబాబు ఇతర కీలకపాత్రల్లో నటిస్తున్నారు.




## సింగర్‌తో దుబాయ్ యువరాణి రెండో పెళ్లి

దుబాయ్ యువరాణి షేకా మహ్రా మొహమ్మద్ రషీద్ అల్ మక్తూమ్(31) సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆమె రెండో పెళ్లి చేసుకునేందుకు సిద్ధమయ్యారు. సరిగ్గా ఏడాది క్రితం మొదటి భర్త నుంచి విడాకులు తీసుకున్న ఆమె ఇప్పుడు నిశ్చితార్థం చేసుకుని వార్తల్లో నిలిచారు. అమెరికన్ రాపర్ 'ఫ్రెంచ్ మోంటానా'(41)తో మహ్రా కొంతకాలంగా ప్రేమలో ఉంది. తాజాగా ఎంగేజ్‌మెంట్ చేసుకున్నట్లు రాపర్ ప్రతినిధి ధృవీకరించారు. ఈ సంవత్సరం జూన్‌లో పారిస్ ఫ్యాషన్ వీక్ సందర్భంగా నిశ్చితార్థం జరిగిందని క్లారిటీ ఇచ్చారు. అయితే, ఆ విషయాన్ని ఇప్పటి వరకు రహస్యంగానే ఉంచినట్లు తెలిపారు. రాపర్ 'ఫ్రెంచ్ మోంటానా' కంటే ఆమె వయసులో సుమారు పదేళ్లు చిన్నది. పెళ్లి తేదీ, ఇతర విషయాలు ఇంకా ప్లాన్ చేయలేదని చెబుతున్నారు. కానీ, ఈ జంట ఇరువురి కుటుంబాలు మాత్రం చాలా సంతోషంగా ఉన్నాయని సమాచారం.

### షేక్ మహ్రా ఎవరు.. మొదటి భర్తతో విడాకులకు కారణం..?

దుబాయ్ పాలకుడు, యూఏఈ ప్రధానమంత్రి 'షేకా మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్' కుమార్తె 'షేకా మహ్రా' బ్రిటన్‌లో చదువుకున్న ఆమె 2023 మే నెలలో దుబాయ్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త 'షేకా మనా బిన్ మొహమ్మద్ అల్ మక్తూమ్'ను పెళ్లి చేసుకున్నారు. వారికి తొలి సంతానం కలిగిన రెండు నెలలకే విడిపోతున్నట్లు 2024 జులైలో ప్రకటించారు. తన భర్త ఇతరుల సహచర్యం కోరుకున్నందున తాను విడాకులు తీసుకుంటున్నట్లు ఆమె చెప్పారు. 'ఐ డైవర్స్ యూ.. టేక్ కేర్..' మీ మాజీ భార్య అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం తన కుమార్తెతో షేకా మహ్రా ఉంది. ఇప్పుడు ప్రేమించి మరో పెళ్లి చేసుకోనున్నడంతో నెటిజన్లు శుభాకాంక్షలు చెబుతున్నారు. అయితే.., రాపర్ 'ఫ్రెంచ్ మోంటానా' ప్రతినిధి ఈ జంట నిశ్చితార్థం చేసుకున్నారని ధృవీకరించినప్పటికీ, వారిద్దరు మాత్రం దాని గురించి ఎటువంటి అధికారిక ప్రకటనను పంచుకోలేదు.



## 2040లో జరిగే స్టోరీ..

### సమ్‌థింగ్ డిఫరెంట్‌గా గ్లింప్స్

తమిళ యువ హీరో ప్రదీప్ రంగనాథన్ లేటెస్ట్ మూవీ 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. నయనతార నిర్మిస్తుండగా ఈమె భర్త విఘ్నేశ్ శివన్ దర్శకత్వం వహించాడు. టైటిల్ విషయమై అప్పట్లో కాస్త కాంట్రవర్సీ అయిన ఈ చిత్రం.. ఇప్పుడు విడుదలకు సిద్ధమైంది. అక్టోబరు 17న థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలోనే ఫస్ట్ పంచ్ పేరుతో ఇప్పుడు గ్లింప్స్ రిలీజ్ చేశారు. సమ్‌థింగ్ డిఫరెంట్‌గా ఉంటూనే ఆకట్టుకుంటోంది. 2040లో చెన్నైలో జరిగే స్టోరీతో ఈ సినిమా తీశారని గ్లింప్స్ చూస్తుంటే అర్థమైపోయింది. ఎస్జే సూర్య విలన్. సంగీతమందించిన అనిరుధ్.. ఇదే మూవీలో కనిపించిన రోబోకు డబ్బింగ్ చెప్పడం విశేషం. అలానే సినిమాలో యష్.. మిషన్ ఇంపాజిబుల్ 14లో నటించాడని, రజినీకాంత్ 189 కూడా చేస్తున్నాడని లాంటి రిఫరెన్సులు ఉన్నాయి. అలానే కొండపై హాలీవుడ్ అక్షరాలు ఉన్నట్లు ఇక్కడ కోలీవుడ్ అని ఉండటం లాంటివి డిఫరెంట్‌గా అనిపించాయి. 2040లో స్వచ్ఛమైన ప్రేమని వెతికే ఓ అమ్మాయి.. హీరోని కలిస్తే తర్వాత ఏమైంది అనే కాన్సెప్ట్‌తో మూవీ తీసినట్లు ఉంది. ఇందులో ఎస్జే సూర్య గెటప్ కూడా కాస్త విచిత్రంగానే ఉంది. ప్రస్తుతానికి తమిళ గ్లింప్స్ మాత్రమే రిలీజ్ చేశారు. త్వరలో తెలుగుది కూడా తీసుకొస్తారేమో చూడాలి.

## అపార్ట్‌మెంట్ అమ్మేసిన సోనూ సూద్.. ఎన్ని కోట్ల లాభమంటే?



బాలీవుడ్ నటుడు సోనూ సూద్ తెలుగువారికి కూడా సుపరిచితమైన పేరు. అరుంధతి మూవీలో తన విలనిజంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఆ తర్వాత పలు టాలీవుడ్ స్టార్ హీరోల చిత్రాల్లో విలన్‌గా మెప్పించారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో మాత్రమే సినిమాలు చేస్తున్నారు ఈ ఏడాది ఫతే మూవీతో ప్రేక్షకులను అలరించారు. తాజాగా సోనూ సూద్ తన ఖరీదైన అపార్ట్‌మెంట్‌ను అమ్మేసినట్లు తెలుస్తోంది. ముంబయిలోని లోఖండ్‌వాలా మినర్వా ప్రాంతంలో ఉన్న మహాలక్ష్మీ అపార్ట్‌మెంట్‌ను దాదాపు రూ.8.10 కోట్లకు అమ్మేసినట్లు సమాచారం. కాగా.. సోనూ సూద్ 2012లో ఈ భవనాన్ని రూ. 5.16 కోట్లకు కొనుగోలు చేశాడు. దాదాపు 13 ఏళ్ల తర్వాత రూ. 2.94 కోట్ల లాభానికి అమ్మేశాడు. ఇక సోనూ సూద్ సినిమాల విషయానికొస్తే చివరిసారిగా ఫతే చిత్రంలో కనిపించారు. ఈ చిత్రానికి సోనూనే దర్శకత్వం వహించారు. అయితే బాక్సాఫీస్ వద్ద ఊహించనంత స్థాయిలో రాణించలేకపోయింది. బాక్సాఫీస్ వద్ద కేవలం రూ. 13.35 కోట్లు వసూలు మాత్రమే చేసింది. ఈ మూవీతో డైరెక్టర్‌గా ఎంట్రీ ఇచ్చాడు సోనూ సూద్. ప్రస్తుతం అతను ఎలాంటి కొత్త ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేయలేదు.

## రెబల్ స్టార్ ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్.. ది రాజాసాబ్ వాయిదా!

రెబల్ స్టార్ ప్రభాస్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న రొమాంటిక్ హారర్ కామెడీ థ్రిల్లర్ ది రాజాసాబ్. ఈ మూవీకి మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన గ్లింప్స్‌కు ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ డిసెంబర్‌లోనే ప్రేక్షకుల ముందుకు రానుందని ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. కానీ ఊహించని విధంగా మరోసారి ఫ్యాన్స్‌కు షాకిచ్చారు. వచ్చే ఏడాదిలో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటన విడుదల చేశారు. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నట్లు నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ప్రకటించారు. మిరాయి ట్రైలర్ లాంచ్‌కు హాజరైన ఆయన ది రాజాసాబ్ కొత్త రిలీజ్ డేట్‌ను రివీల్ చేశారు. జనవరి 9న ది రాజాసాబ్ విడుదల చేస్తామని వెల్లడించారు. టాలీవుడ్‌లో షూటింగ్స్ బంద్ కారణం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. వీఎఫ్ఎక్స్ విషయంలో ఎక్కడ కంప్రమైజ్ కాకుండా హై క్వాలిటీతో తెరకెక్కిస్తున్నామని అన్నారు. దీంతో రెబల్ స్టార్స్ కొంత నిరాశకు గురవుతున్నారు. కాగా.. ఇప్పటికే పొంగల్ బరిలో చాలా చిత్రాలు ఉన్నాయి. వాటితో ది రాజాసాబ్ పోటీ పడడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా.. ఈ చిత్రంలో సినిమాలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిధిలు హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరి బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు.





OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com